


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 09-06-2022 సంపుటి : 03 సంచిక : 260 పేజీలు : 4 వెల : రూ 3-00


# పెరిగిన వడ్డీ రేట్లు..

## ఈఎంఐలు మరింత భారం




ముంబై: బ్యాంకు వడ్డీలు ఇప్పుడు మరింత భారం కానున్నాయి. రెపో రేటును పెంచుతూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్నది. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ దీనికి సంబంధించిన ప్రకటన చేశారు. రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు పెంచేందుకు ద్రవ్యపరపతి సంఘం ఏకగ్రీవంగా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. 50 బీపీఎస్ పెంపుతో రెపో రేటు 4.90 శాతానికి చేరుకున్నది. రెపో రేటును పెంచడం వల్ల వడ్డీ రేట్లు కూడా పెరగనున్నాయి. దీంతో కార్లు, పర్సనల్, హోం లోన్స్‌పై వడ్డీ కూడా పెరగనున్నది. దీని వల్ల ఈఎంఐలు కూడా పెరుగుతాయి. అయితే పెంచిన వడ్డీ రేట్లను తక్షణం అమలు చేయనున్నట్లు గవర్నర్ శక్తికాంత్ దాస్ తెలిపారు. ఈసారి సాధారణ వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని, క్రూడాయిల్ ధరలు కూడా ప్రస్తుతానికి అదుపులో ఉన్నందున 2022-23 సంవత్సరానికి ద్రవ్యోల్బణం 6.7 శాతం ఉంటుందని ఆర్బీఐ గవర్నర్ అంచనా వేశారు. డిజిటల్ పేమెంట్ వ్యవస్థ మరింత దూకుడుగా మారాలని, దీని కోసం యూపీఐ ఫ్లాట్‌ఫామ్‌తో క్రెడిట్ కార్డులను జోడించే ప్రతిపాదన ఉన్నట్లు ఆర్బీఐ గవర్నర్ వెల్లడించారు.

# వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు సాధించాలి : ఏపీ సీఎం జగన్

## గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై తాడేపల్లిలో వర్క్‌షాప్





తాడేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. మంత్రులు, రీజనల్ కో ఆర్డినేటర్స్, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్క్‌షాపును ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏమన్నారంటే..గడపగడపకూ అనేది నిరంతరాయంగా జరిగే కార్యక్రమందాదాపు 8 నెలలపాటు ఈకార్యక్రమం జరుగుతుదిఒక్కో సచివాలయానికి రెండు రోజులపాటు కేటాయింపునెలలో 20 రోజులచొప్పున 10 సచివాలయాల్లో గడపగడపకూ కార్యక్రమంగడపగడపకూ కార్యక్రమాన్ని ఏరకంగా చేశాం? ఎలా చేస్తున్నాం? ఇంకా ఎలా మెరుగుపరుచుకోవాలి? ఎలా సమర్థత పెంచుకోవాలి? అన్నదాన్నికూడా మనం నిరంతరంగా చర్చించుకోవాలి. అందుకోసం నెలకోసారి వర్క్‌షాపు నిర్వహిస్తాంఆ నెలరోజుల్లో చేపట్టిన గడపగడపకూ కార్యక్రమం, ఈ కార్యక్రమం ద్వారా మనకు వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై ఈ వర్క్‌షాపులో చర్చిస్తాంఇంకా మెరుగ్గా, సమర్థవంతంగా కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలన్నదానిపై ఈ వర్క్‌షాపుల్లో దృష్టిసారిస్తాంప్రజాప్రతినిధుల నుంచి ఈ వర్క్‌షాపుల్లో సూచనలు, సలహాలు కూడా నిరంతరంగా తీసుకుంటాం, వాటిపై చర్చిస్తాం. దీనివల్ల మన ప్రయాణం మరింత మెరుగ్గా సాగుతుందిగడపగడపకూ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులకు ప్రజలనుంచి వచ్చిన విజ్ఞాపనలు, ఆ విజ్ఞాపనల పరిష్కారం కూడా అత్యంత ముఖ్యమైనదిఈ ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా సాగడంపైన కూడా దృష్టిపెడుతున్నాంగత ఎన్నికల్లో 151 సీట్లు వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో 175కి 175 సాధించాలి. ఇది మన లక్ష్యం, ఇది కష్టం కాదు. ఎందుకంటే.. ప్రతి ఇంటికీ మీరు వెళ్తున్నారు, ప్రతి ఇంటికీ జరిగిన మేలును వివరిస్తున్నారుఏయే పథకాలు ఆ కుటుంబానికి అందాయో చెప్తున్నారు. ప్రతి అక్క చెల్లి పేరుమీద లేఖ కూడా ఇస్తున్నారుమనకు ఓటు వేయని వ్యక్తికి కూడా కులం చూడకుండా, మతం చూడకుండా, రాజకీయాలు చూడకుండా, పార్టీలు చూడకుండా పారదర్శకంగా మేలు చేశాంప్రతి ఇంటికీ మేలు జరిగినప్పుడు.. ప్రజా ప్రతినిధులుగా మనకు ఏంకావాలిచరిత్రలో మనం ఒక ముద్ర వేశాంసంతృప్తిస్థాయిలో మంచి చేశామని చెప్పుకోగలుగుతున్నాం.కాలర్ ఎగరేసుకుని తిరగగలుగుతున్నాంఇక మనం చేయాల్సిందల్లా.. ప్రజల మద్దతును మనం తీసుకోవడమేఎవరైనా అనుకున్నామా? కుప్పంలో మున్సిపాల్టీ గెలుస్తామని?ఎంపీటీసీలు, జడ్పీటీసీలు క్లీన్ స్వీప్ చేస్తామని? ఎందుకు జరిగింది?అలాగే 175కి 175 సాధించగలుగుతాం. ఇది జరగాలి అంటే.. మనం కష్టపడాలిరాష్ట్రంలోని 87శాతం కుటుంబాలకు పథకాలు చేరాయిప్రతి సచివాలయంలోనూ కచ్చితంగా 2 రోజులు గడపగడపకూ నిర్వహించాలిప్రతి సచివాలయంలోనూ పొద్దుట నుంచి సాయంత్రం 6?7వరకూ గడపగడకూ నిర్వహించాలిప్రతి నెలలో 10 సచివాలయాలు నిర్వహించేలా ప్రణాళిక వేసుకోవాలిప్రతి నెలలో 20 రోజులు గడపగడపకూ నిర్వహించాలి. కార్యక్రమాన్ని నాణ్యతతో చేయడం అన్నది చాలా ముఖ్యం' అని సీఎం జగన్ అన్నారు.

# విద్యుత్ మీటర్లను తెచ్చిందే చంద్రబాబు: స్పీకర్ తమ్మినేని



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ మీటర్ల వ్యవస్థను చంద్రబాబు తీసుకొచ్చారని ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆరోపించారు. నాడు మీటర్లను తీసుకొచ్చి నేడు వద్దంటూ అధికార పార్టీపై దుమ్మెత్తి పోస్తున్నారని విమర్శించారు. కేంద్రంతో టీడీపీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం మేరకు ఏపీలో వ్యవసాయానికి ప్రభుత్వం కొత్త మీటర్లను బిగిస్తున్నారు. మరోవైపు మీటర్లు బిగించవద్దని టీడీపీ సహా విపక్షాలు డిమాండ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మీటర్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టలేదని చంద్రబాబుతో చెప్పించగలరా అని సవాల్ విసిరారు. కొత్త మీటర్లను బిగించలేకపోతే విద్యుత్ ను ఆదా చేసుకోలేమని స్పీకర్ వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో ఉన్న లోపాలను తొలగించి రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# 151 కాదు.. కుప్పంతో కలిపి 175 స్థానాల్లో గెలుస్తాము: మంత్రి అంబటి

తాడేపల్లి: టీడీపీ నేతలకు పనేమీ లేదని ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల్లోకి మరింత ఉధృతంగా వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల రోజుల్లో ప్రతీ గడప గడపకూ వెళ్తున్నాము. ప్రజలకి మేము చేసింది చెప్తున్నాం. నెలలో 20 రోజులు ప్రజల్లోనే ఉండాలని సీఎం జగన్ ఆదేశించారు. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు ఇంకా ఏమైనా ఫిర్యాదులు చేస్తే.. వాటిని వెంటనే పరిష్కారించే దిశగా ప్రయత్నం చేయాలని సీఎం జగన్ చెప్పారు. పథకాలు అందడం లేదంటే.. అందుకు గల కారణం కనుక్కోవాలని సీఎం జగన్ తెలిపారు. టీడీపీ వారికి పనేమీ లేదు.. గడప గడప కార్యక్రమంపై విమర్శలు చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్తే వాస్తవం తెలుస్తుంది. సీఎం జగన్ ఇస్తున్న పథకాలు, పరిపాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. టీడీపీ వాళ్లతో పాటు అన్ని పార్టీల వారికి సంక్షేమ పథకాలు అందాయి. లక్ష 50వేల కోట్ల నిధులు నేరుగా ప్రజలకి అందాయి. 151 స్థానాలు కాదు. ఈ సారి కుప్పంతో కలిపి 175 గెలుస్తాం అని తెలిపారు.



# గ్రేస్ మార్కులతో విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలి : పవన్‌కల్యాణ్

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న తప్పుడు విధానాలతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటీవల విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు తక్కువ ఉత్తీర్ణత సాధించడం ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమని ఆరోపించారు.పాఠశాలల్లో అరకొర వసతులు, ఉపాధ్యాయుల కొరత తదితర కారణాల వల్ల విద్యార్థులకు సరైన బోధన అందలేదని అన్నారు. పది విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇచ్చి వారి భవిష్యత్ కాపాడాలని కోరారు. ఉచితంగా రీ-కౌటింగ్ నిర్వహించాలని, సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజులు తీసుకోకూడదని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఫెయిలైతే తల్లిదండ్రులపై నెపం వేయడాన్ని తప్పుపట్టారు. 2018,19 సంవత్సరాల్లో 94శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే ప్రస్తుతం 67 శాతానికి మాత్రమే పరిమిత మవడం విద్యావ్యవస్థలో ఉన్న లోపాలకు అద్దం పడుతుందని ఆరోపించారు. ఆడపిల్లలపై అత్యాచారాలు జరుగుతుంటే తల్లుల పెంపకం సక్రమంగా లేదని



ప్రభుత్వంలోని బాధ్యత గల ప్రజా ప్రతినిధి వ్యాఖ్యనించడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వ వాదనలు వింటుంటే అసహ్యం కలుగుతోందన్నారు. పట్టుమని పది పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించలేదని విమర్శించారు. గిట్టుబాటు ధర కల్పించి రైతులకు అండగా నిలవలేదని వివరించారు.

# డాక్టర్ల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారు.. కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తీరుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నీట్ పీజీ సీట్లను భర్తీ చేయకపోవడంపై మండిపడింది. డాక్టర్ల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారని విమర్శించింది. దేశంలో ఓ వైపు వైద్య నిపుణుల కొరత ఉంది. మరోవైపు పీజీ సీట్లు ఖాళీగా ఉండటంపై సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ఈ సంవత్సారానికి సంబంధించిన చివరి విడత నీట్ పీజీ సీట్ల భర్తీ మే 7తో ముగిసింది. అయితే ఇంకా 1,456 పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా వీటిని భర్తీ చేయాలని కోరుతూ ఏడుగురు డాక్టర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎంఆర్ షా, అనిరుద్ధ బోస్‌ల నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వం తీరుపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చాలా మంది డాక్టర్లు, సూపర్ స్పెషలిస్ట్‌ల అవసరం ఉన్నప్పుడు పీజీ సీట్లను ఖాళీగా ఉంచి ఏం చేస్తారు? ఈ విషయంలో ఏమైనా బాధ్యత ఉందా? ప్రతిసారి కోర్టు జోక్యం చేసుకోవాలా? కోర్టు ఆర్డర్ కోసం ఎందుకు ఎదురు చూస్తున్నారు? ప్రత్యేక కౌన్సిలింగ్ ద్వారా ఖాళీ సీట్లను ఎందుకు భర్తీ చేయరు? అని కేంద్రాన్ని ప్రశ్నించింది. డాక్లర్ల భవిష్యత్తుతోపాటు వారి కొరతపై ఆటలాడుకుంటున్నారని కేంద్రానికి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి ఖాళీగా ఉన్న నీట్- పీజీ సీట్లను భర్తీ చేయాలని ఆదేశించింది. దీనిపై అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, మెడికల్ కౌన్సిలింగ్ కమిటీ (ఎంసీసీ)ని ఆదేశించింది. వైద్య విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకపోతే వారి జీవితాలు, భవిష్యత్తుతో ఆడుకున్నందుకు పరిహారం చెల్లించాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

# విద్యా వ్యవస్థను నాశనం చేసిన జగన్

## మాజీ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వర రావు

విజయవాడ బుధవారం ఉదయం మొగల్రాజపురంలోని లోని టీడీపీ పోలిట్బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వర రావు ఇంటివద్ద విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. కరోనా సమయంలో బ్రాందీ షాపుల దగ్గర టీచర్లను నిలబెట్టారు అంటే విద్యార్థులపై, ఉపాధ్యాయులపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి ఎంతో అర్థం అవుతుందన్నారు. టెన్త్ క్లాస్ ప్రశ్నపత్రం లీకేజీ వెనుక వైసిపి హస్తం ఉంది అన్నారు. కావాలని నారాయణ పై తప్పుడు కేసులు పెట్టారన్నారు. టెన్త్ క్లాస్ ఫలితాలు కమర్షియల్ చేశారు అని, 2 లక్షల విద్యార్థులు ఫెయిల్ అవ్వడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం అన్నారు.. అమ్మఒడికి అర్హత లేకుండా చేయడానికే విద్యార్థులను ఫెయిల్ చేశారు

# ప్రజలతో మమేకం అయితేనే ప్రజాస్పందన తెలిసేది.. బాబుకి అది తెలీదు



తాడేపల్లి: ప్రభుత్వం పట్ల లేని వ్యతిరేకతను వండి వార్చి ఇవ్వడం సరికాదని మీడియాకు హితవు పలికారు ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని. బుధవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో.. పార్టీలకు అతీతంగా అందరి అభిప్రాయం తెలుసుకోవాలని సీఎం జగన్ చెప్పారు. సంక్షేమ పథకాలు అందకున్నా, ఒకవేళ ఏదైనా సమస్య ఉంటే.. విమర్శలను స్వీకరించి పొరపాట్లను సరిదిద్దాలని నేతలకు సీఎం జగన్ దిశానిర్దేశం చేశారని పేర్ని నాని వెల్లడించారు. టీడీపీ నేతల విమర్శలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారంపై పేర్ని నాని స్పందిస్తూ.. అలా అనుకుంటే వాళ్ల మనుగడ కొనసాగేది!. 2019లో నేనే సీఎంగా ప్రమాణం చేస్తానంటూ చంద్రబాబు నాయుడు కొత్త బట్టలు కుట్టించుకున్నారు. పదవి ఊడేదాకా చంద్రబాబుకు విషయమే తెలియలేదు. ప్రజలతో మమేకమై ఉంటేనే కదా ఆయనకు ప్రజాస్పందన తెలిసేది. ఇప్పుడు ఊహల్లోనే బతుకుతున్నాడు.. పార్టీని బతికించాలి.. కొడుకు నాయకత్వాన్ని బతికించే తాపత్రయం తప్పా ఇంకేం కనిపిం చడం లేదని, ప్రజల్లోకి వెళ్తే వాస్తవ పరిస్థితి ఏంటో ఆయనకు తెలిసొస్తుందని పేర్ని నాని చెప్పారు.

# సంపాదకీయం

**గురువారం 09-06-2022**

## పాన్ ఇండియా అర్థం మారుతోందా

తెలుగు సినిమా రంగంలో వినిపిస్తున్న బజ్ వర్డ్ 'పాన్ ఇండియా మూవీ' మరి, 'పాన్ ఇండియన్ మూవీ' అంటే ఏమిటి? ఏదో ఒకటి రెండు సినిమాలు దేశవ్యాప్తంగా డబ్బింగ్ అయిపోతే 'పాన్ ఇండియన్' అయినట్టేనా? కమలహాసన్ హైదరాబాద్ వచ్చి 'పాన్ వరల్డ్' సినిమా తీయాలనేసి వెళ్లిపోయారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో ఆయా సినిమాలు విడుదలై విజయవంతమైతే, అక్కడి ప్రజలను ఆకట్టుకుంటే దాన్ని 'పాన్ ఇండియన్' అనాలి. అనేక భాషలలోకి డబ్ చేసి విడుదల చేస్తే అవి డబ్బింగ్ సినిమాలే అవుతాయి.గతంలో ఎంజీ రామచంద్రన్, శివాజీ గణేశన్‌లాంటివాళ్ల సినిమాలు తెలుగులో వచ్చినప్పుడు వాటిని డబ్బింగ్ సినిమాలు అనేవాళ్లు. తెలుగు సినిమాలు దేశవ్యాప్తంగా కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ విజయసోపానాలు ఎక్కుతున్నాయనే మరో వాదనా ఉంది. అంటే 'పాన్ ఇండియా' అన్న భావనకు వసూళ్లు మాత్రమే కారణమంటారు. ఒక 'పుష్ప' లేదా 'ఆర్ఆర్ఆర్'లాంటివి కొన్ని ఆ కోవలోకి వస్తాయి వాటితో పాటు 'పాన్ ఇండియన్ స్టార్' అని పిలిపించుకున్న ప్రభాస్ సినిమా 'రాధేశ్యామ్' చిరంజీవి అండ్ చరణ్ సినిమా 'ఆచార్య' ఎంత పెద్ద ఫ్లాప్ చెప్పుకోవాల్సిన పని లేదు. ఈ నేపథ్యంలో కమర్షియల్‌గా కూడా తెలుగు సినిమా ఇంకా 'పాన్ ఇండియన్' స్థాయికి రాలేదన్నది వాస్తవం.కలెక్షన్స్ విషయంలో ఎవరెంతగా నిజాలు చెబుతున్నారో తెలీదు. ప్రచారాన్ని బట్టి వాళ్లంతా ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో టాక్స్ కట్టాలి. కడుతున్నారా? 'లోగుట్టు పెరుమాళ్లకెరుక' ఇక మన ప్రభుత్వాలు అడక్కముందే టికెట్ రేట్లు పెంచుకోవడానికి అనుమతులిస్తాయి. టాక్స్ విషయంలో మాత్రం ఏ మాటా బహిరంగంగా వుండదు. అవన్నీ మన కెందుకు కానీ, అకడమిక్‌గా ఆలోచిస్తే ఈ 'పాన్ ఇండియా' అనే దానిలోనే ఏదో అర్థ రాహిత్యం ఉ oదనిపిస్తుంది. ఎందుకంటే, మన దేశంలో ప్రతి ఆరు కోసుల దూరంలో ఉన్న ప్రజల భాష, యాస, జీవన విధానం, ఆహారపుటలవాట్లు, ఆహార్యంలో భిన్నత్వముంటుంది. అంత వైవిధ్యభరిత దేశం మనది. అలాంటప్పుడు ఒక సినిమా 'పాన్ ఇండియన్' కావాలంటే చాలా లక్షణాలను కలిగి ఉండాలి.మన తెలుగు సినిమా దాదాపు 70వ దశకం ఆరంభం నుండే కనీస ప్రాంతీయ లక్షణాలను కోల్పోయిందనేది వాస్తవం. ప్రాంతీయ సినిమాగా నిలబడాలంటే ఆ ప్రాంతపు ప్రజల జీవితాలూ, జీవన విధానాలూ, భాషాసంస్కృతులు వాటిలో ప్రతిబింబించాలి. కానీ, ఆ పరిస్థితి మెజారిటీ సినిమాలలో లేకుండా పోయింది. ఏదైనా ఒక ప్రాంతీయ సినిమా గొప్ప వాస్తవికతతో రూపొంది, మొత్తం భారతీయ సమాజం అందులో ఐడెంటిఫై అయితే, అది 'పాన్ ఇండియన్' సినిమా అవుతుందని నేననుకుంటాను. అది వ్యాపార సినిమా అయినా సరే. తెలుగులో ఆ సినిమాలు రావడానికి ఇంకా చాలా సమయం పడుతుంది.ప్రాంతీయంగా ఈశాన్య రాష్ట్రాల నుంచి వస్తున్న సినిమాల గురించి మాట్లాడుకోవాలి. ఇప్పటికీ ఇంకా అనావిష్కృతంగా ఉన్న అక్కడి భాషా సంస్కృతులు, జీవన విధానమూ అన్నీ ఇటీవల అక్కడ నుంచి వచ్చిన సినిమాలలో మనకు స్వచ్ఛంగా కనిపిస్తాయి. అవి దేశ విదేశాలలో మన్ననలు కూడా అందుకున్నాయి. ప్రకృతి సిద్ధ నదీనదాలూ, పర్వతాలతో, స్వచ్ఛ వాతావరణంతో తులతూగే ఈశాన్య భారతం నుంచి వచ్చిన సాహిత్యం, సంగీతం, సినిమా మొదలు అన్ని కళలూ అత్యంత ప్రాంతీయమై, దేనికీ అనుకరణ కాకుండా, ఆసలు సిసలు కళారూపాలుగా ఉంటాయి.అస్సామీ సినిమా 'జాలీవుడ్' గా పిలవబడుతున్నది. 1935లో జ్యోతిప్రసాద్ అగర్వాలా నిర్మించిన 'జోయ్‌మతి'తో అసామీ సినిమా ప్రారంభమైంది. ఇటీవల దర్శకురాలు రీమాదాస్ రచించి, దర్శకత్వం వహించిన సినిమా 'విలేజ్ రాక్ స్టార్స్' సహజంగానూ, గ్రామీణ నేపథ్యంలోనూ చిత్రించబడింది. అసామ్ జనజీవన సజీవ దృశ్యంలా సాగుతుంది. మహిళలు ముఖ్యంగా అమ్మాయిలు స్వంత కాళ్లపై నిలబడడం, వ్యక్తిత్వ నిర్మాణం రూపొందించుకోవడం, తన కలలను సాకారం చేసుకోవడం అనే అంశాలపై ఈ సినిమా సాగుతుంది. విజువల్‌గా అద్భుతంగా ఉండి అబ్బుర పరుస్తుంది.ఓ మారుమూల గ్రామంలో ధును అనే పదేళ్ల అమ్మాయి విధవరాలైన తన తల్లి, బద్ధకస్తుడు అయిన అన్నతో కలిసి జీవిస్తుంటుంది. తల్లి చేసిన తినుబండారాలను అమ్ముకురావడానికి జాతరకు వెళ్లిన ధును అక్కడ ఒక బాండ్ ప్రదర్శన చూసి అబ్బురపడుతుంది. ఒక కార్టూన్ పుస్తకం చూసి ప్రభావితమవుతుంది. తానూ ఒక గిటారిస్ట్ కావాలని, తానూ ఒక బాండ్ రూపొందించుకోవాలని కలలు కంటుంది. పాజిటివ్‌గా ఉంటే కలలు సాకారమవుతాయని, దాంతో దేన్నయినా సాధించుకోవచ్చునని అర్థం చేసుకుంటుంది. పేదరికం, అసహాయత అడ్డు పడుతున్నా దీక్షతో ఒక్కో రూపాయి కూడబెడుతుంది.అప్పుడే ధును రజస్వల అవుతుంది. ఆచారాల ప్రకారం తంతు నిర్వహిస్తారు. అప్పటి నుంచి ఆంక్షలు మొదలవుతాయి. చీరె కట్టుకోవాలని, మగపిల్లలతో కలిసి తిరగొద్దని చెబుతారు. ధును తల్లి అందుకు భిన్నంగా తన బిడ్డకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇస్తుంది. వరదలకు వాళ్లకున్న కొద్ది భూమిలో పంట కొట్టుకు పోతుంది. ఏటా వరదలకు కొట్టుకుపోయే ఈ వ్యవసాయం ఎందుకు చేయాలని ధును తల్లిని అడుగుతుంది. మునిగిపోతుందని ఏమీ చేయకుండా ఉండలేము కదా? అంటుంది తల్లి. రూపాయి రూపాయి కూడబెట్టిన ధును తన గిటార్ కలను నెరవేర్చుకుంటుంది.ఇక 'లోక్ తక లయిరంబీ ' సినిమాకు పబ్బాన్ కుమార్ దర్శకత్వం వహించారు, ఫుండి సరస్సులో మణిపూర్ ప్రభుత్వం చేపట్టిన 'బయోమాస్ క్లియరెన్స్' కార్యక్రమం ఫలితంగా నిర్వాసితులైన మత్స్యకారుల జీవనపోరాటం ఈ సినిమా. మణిపూర్ జీవన చిత్రంగా నిలుస్తుంది. మరో సినిమా 'నానా' మన కథే. తియాకుం జుక్ తీసిన ఈ సినిమా నాగా ఫిలిం. ఇక త్రిపురకు చెందిన అత్యంత సారవంత రైమా లోయ ప్రాంతం దుమ్‌బూర్ డ్యాం నిర్మాణం వలన ఎట్లా మునిగిపోయిందో, ఫలితంగా ఎంతమంది నిర్వాసితులయ్యారో, వారి జీవితాల చుట్టూ తిరుగుతుందీ సినిమాదేశంలో మారుమూల ప్రాంతం ఈశాన్య రాష్ట్రాల నుంచి అత్యంత ప్రతిభావంత ప్రాంతీయ సినిమాలు అనేకం వస్తున్నాయి. అదే తరహాలో మన తెలుగు సినిమాలు కూడా ప్రాంతీయ సినిమా లక్షణాలను పుణికి పుచ్చుకుని 'పాన్ ఇండియా' సినిమాగా ఎదగాలి. ఆ సినిమాలు వ్యాపారాత్మకం అయినా సరే. 'ఆల్ ది బెస్ట్ తెలుగు ఫిలిం ఇండస్ట్రీ'.

# పాపం... మంత్రిగారు..ఎమ్మెల్యే...

కాకినాడ, జూన్ 8, కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరు పెట్టడాన్ని నిరసిస్తూ, గత నెల 24న అమలాపురంలో విధ్వంసకాండ జరిగింది. అల్లర్లలో మంత్రి విశ్వరూప్ క్యాంపు కార్యాలయం, ఇల్లు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ ఇంటికి నిప్పు అంటించారు ఆందోళనకారులు. ఆ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఏకంగా మంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్యే ఇళ్లకు నిప్పు పెట్టడం సంచలనమైంది. పార్టీ కూడా తీవ్రంగా పరిగణించింది. కానీ అప్పటి నుంచి మంత్రి, ఎమ్మెల్యే ను కనీసం పలకరించేవారే కరువయ్యారు. సంఘటన తర్వాత పార్టీ ప్రభుత్వ పెద్దలు అమలాపురానికి క్యూ కడతారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. నిప్పు అంటించిన ప్రాంతానికి స్వయంగా వచ్చి పరిశీలిస్తారని అందరూ అనుకున్నారట. మంత్రి విశ్వరూప్ సైతం ఇష్యూ జరిగిన తర్వాత రోజు రెండు ప్రాంతాలను పరిశీలించారు. పార్టీ, ప్రభుత్వం నుంచి పెద్ద హోదాలో గల వ్యక్తులు వస్తారని అనుచరులకి సమాచారం ఇచ్చారట. వారి ముందు, జరిగిన ఘటనకు గురించి చెప్పాలని సూచించారట. ఇంకేముంది ఈ విషయం అధిష్ఠానం సీరియస్ గా తీసుకుందన్న ప్రచారం జోరుగా జరిగింది. అమలాపురం అల్లర్లు జరిగినప్పుడే బీసీ మంత్రుల సామాజిక న్యాయ బస్సు యాత్ర జరిగింది. అప్పుడు ఆ బస్సు యాత్ర జిల్లాలోనే ఉంది. మొత్తం మంత్రులు ఇలా అమలాపురం వచ్చి వెళ్తారని క్యాడర్ అనుకున్నారు. కానీ అటువంటిది ఏమి జరగలేదు సరి కదా.. స్వయంగా మంత్రి విశ్వరూప్ ని ఆ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశాలు రావడంతో అవాక్కయ్యారట. క్యాబినెట్ లో మంత్రిని కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారని తెగ మధనపడిపోతున్నారట విశ్వరూప్ అనుచరులు.అప్పట్నుంచి క్యాడర్ కు సర్ది చెప్పలేక పోతున్నారట మంత్రి. మీకే ఇలాంటి పరిస్థితులుంటే, ఇక మా లాంటివారి పరిస్థితి ఏంటని గోడు వెళ్ళబోసుకుంటున్నారట. వారిని సముదాయించలేక, సమాధానం చెప్పలేక, నియోజకవర్గానికి రావడం మానేశారట మంత్రి. అయితే హైదరాబాద్ లేదంటే విజయవాడకే పరిమితం అవుతున్నారట. ఇక మంత్రి పరిస్థితి ఇలా ఉంటే, తాను అతిగా ఊహించుకోవడం అత్యాశ అవుతుందని సరి పెట్టుకుంటున్నారట ఎమ్మెల్యే. ఘటన జరిగిన తర్వాత ఇప్పటి వరకు నియోజకవర్గంలో అడుగు పెట్టలేదట పొన్నాడ సతీష్. పూర్తిగా కాకినాడకే పరిమితం అయ్యారట. ఎవర్నీ కలవడానికి, మాట్లాడ్డానికి ఇష్టపడటం లేదట. కనీసం శాంతి భద్రతల సమస్య కాబట్టి హోంమంత్రి, డీజీపీ వస్తారని అంచనా వేశామని, మరీ ఇలా తీసి పడేశారేంటని అంటున్నారట. అందరూ సపోర్ట్ చేసి ఉంటే, ఇష్యూ సీరియస్ నెస్ మరొక విధంగా ఉండేదని చెప్తున్నారట. ఇప్పుడు అనవసరంగా తాము బ్లేమ్ అవుతున్నామని, బాధ వెళ్లగక్కుతున్నారట. అయినా కోనసీమ జిల్లా పేరుకు సంబంధించి తమకు ఎటువంటి ప్రయోజనాలు ఉండవు కదా అని తమలో తామే మధన పడిపోతున్నారట.ఇంత సున్నితమైన విషయంలో తమను ఏకాకులను చెయ్యడం ఎంతవరకు సమంజసమని గగ్గోలు పెడుతున్నారట. ఇలాంటి చర్యల వల్ల క్యాడర్ కు తప్పుడు సంకేతాలు వెళ్తాయని చెవులు కొరుక్కుంటున్నారట. అసలు తాము చేసిన తప్పేంటో తెలియాలి కదా అని, తనను కలిసిన ఎంపీ బోస్ దగ్గర బాధను వెళ్లబోసుకున్నారట ఇరువురు నేతలు. పార్టీ కోసం ఎంతో చేశామని, పార్టీ కూడా తమకు ఎంతో ఇచ్చిందని, అది కాదనమని, కానీ ఇలా వ్యవహరించడం సరికాదని వాపోతున్నారట. ఈ ఘటనలో జరిగిన నష్టం కంటే అసలు తమను పిలిచి మాట్లాడి వివరణ అడగలేదనే బాధే వారిలో ఎక్కువగా కనిపిస్తోందట.మొత్తానికి విధ్వంసానికి పరామర్శ లేదని ఆ ఇరువురు నేతలు తెగ మధన పడిపోతున్నారు. ఈరోజు తమకు జరిగింది..రేపు ఎవరికైనా జరగవచ్చని.. దానికి ఒక సిస్టం అంటూ ఉండాలి కదా అని అంటున్నారు. అధిష్టానం సంగతి అటుంచితే కనీసం జిల్లాకు చెందిన మంత్రులు కూడా అమలాపురం వైపు తొంగి చూడకపోవడం బాధిత మంత్రి, ఎమ్మెల్యేను విస్మయానికి గురి చేస్తోందట.

# వాలంటీర్ల ట్రైనింగ్.. ఆపసోపాలు పడుతున్ననేతలు

తిరుపతి, జూన్ 8, ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు గడప గడపకు వైసీపీ పేరుతో ఇంటింటికీ తిరుగుతున్నారు. వైసీపీ మూడేళ్ల పాలన పూర్తి కావడం, ఇక రెండేళ్లు వుండటం, రెండేళ్లలో ఒక ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో, హరీబరీగా తిరుగుతున్నారట. ఇక నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు ప్రజల మధ్యలో ఉండాలని అధిష్టానం ఆదేశించింది. గడపగడపకు వైసీపీ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చింది. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం ఎంతెంత ఇచ్చింది?పథకాల గురించి ప్రచారం చేయాలని ఆదేశించింది. అంతవరకూ బాగానే ఉంది కానీ, ప్రజల నుంచి ఎమ్మెల్యేలకు, అక్కడక్కడా నిలదీతలు ఎదురౌతున్నాయి. ఇన్నాళ్లు ఏసీ కారులు,గదుల్లో ఉండి..అప్పుడపుడు జనం మధ్యకు వచ్చే వైసీపీ నేతలకు, గడపగడప కార్యక్రమం ముచ్చెమటలు పట్టిస్తోందనే టాక్ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగానే సాగుతోంది.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి తొలిరోజే చాలా చోట్లా నిరసనల సెగ తగిలింది. ప్రజల ఇళ్లకు వెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేలకు సమస్యలు స్వాగతం పలికాయి. కొన్నిచోట్ల చేదు అనుభవాలూ ఎదురయ్యాయి.ఈ మూడేండ్లలో ఏం చేశారని పలువురు నేతల్ని ముఖం మీదే నిలదీశారు. ఏండ్లు గడుస్తున్నా తమ కష్టాలకు పరిష్కారాలు చూపడంలేదనీ, అర్హతలున్నా సంక్షేమ పథకాలు అందడంలేదని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉమ్మడి చిత్తూరులో పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు రెండు, మూడు ఇళ్లకే పరిమితమయ్యారని సమాచారం . ముఖ్యంగా చిత్తూరు, మదనపల్లె, సత్యవేడు, జీడి నెల్లూరు, పూతలపట్టు, నగరి,పుంగనూరులో ఈ పరిస్థితి ఎక్కువ ఉందట. నగరి నియోజకవర్గంలోని టీసీ అగ్రహారం, కల్లూరు గ్రామ సచివాలయాల పరిధిలో పర్యటించిన మంత్రి రోజాపై, స్థానికులు కరెంట్ చార్జీల పెరుగుదలపై ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో ఇక్కడే కాదు దేశం మొత్తం పెరిగాయంటూ సైలెంట్ గా సైడ్ అయిపోయారు రోజా .పుంగనూరులో సోమల, రొంపిచెర్ల క్రాస్‌లో పర్యటించారు మంత్రి పెద్దిరెడ్డి. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారితోనే మంత్రి ఎదుట మాట్లాడించేందుకు స్థానిక నాయకులు తంటాలు పడ్డారట. నిరసన తెలుపుతారనే భయంతో ప్రభుత్వ పథకాలు అందనివారిని, మంత్రి ఎదుటకు రాకుండా చూసుకునేందుకు అష్టకష్టాలు పడ్డారట. జీడి నెల్లూరు రామాపురంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి స్థానికుల సెగ తగిలింది. జనం ముందు ప్రశ్నలు ఎదుర్కోవడం ఒకటైతే, ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో నేతలు అల్లాడిపోతున్నారు. దీంతో సెగ తగిలిన ఎమ్మెల్యేలు రూట్ మారిస్తే, సెగ తగలకుండా ఉండేందుకు మరికొందరు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నరనే టాక్ సాగుతోంది.అందులో భాగంగానే మంత్రులు, ఎమ్మెల్యేల కంటే ముందుగానే, ఆయా కాలనీలకు వెళ్తున్నారట డ్వాక్రా లీడర్లు, వాలంటీర్లు. మేం చెప్పినట్టే, సార్ వద్ద చెప్పాలి, వేరే ఏం మాట్లాడు కూడదంటూ ట్రైనింగ్ ఇస్తున్నారట. మరికొందరైతే, పలమనేరు ఎమ్మెల్యేకు షాక్ ఇచ్చినట్లు, ఎక్కడైనా మాకాలనీకి ,ఇంటికి రావద్దు అంటూ బేనర్లు కట్టారేమోనని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకుని, అంతా క్లియరెన్స్ వచ్చాకే గడప గడపకు వెళుతున్నారట. అలా ప్లాన్ చేసే వారిలో డిప్యూటీ సీఎం, మంత్రి రోజాలు ముందున్నారనే టాక్ ఇప్పుడు జిల్లాలలోనే కాకుండా సోషల్ మీడియాలోను హాట్ టాపిక్ గా మారిందట.ఇక డిప్యూటీ సీఎం నారాయణకి అయితే, హారతీ ఇవ్వకపోతే ఫైన్ వేస్తారనే చెప్పే వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇలా అన్నీ పక్కాగా సెట్ చేసుకుని వెళ్ళినా, అప్పుడప్పుడు, అక్కడక్కడా నిరసన సెగ తగులుతోందని నేతలు తలలు పట్టుకుంటున్నారట. అన్ని నియోజకవర్గాల్లో అన్నీ బాగున్నాయని, మా పనితీరు బాగుంటుందని చెప్పుకోవడానికి నేతలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారివారి అనుచరులు మాట్లాడుకుంటున్నారట. ఏమాత్రం చిన్న ఇష్యూ అయినా ప్రతిపక్షాలు ఉతికేయడానికి రెడీ ఉన్న నేపథ్యంలో, ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకోవడం తప్పేమీ కాదని అధికార పార్టీ నేతలు, ఎవరికి వారే బహిరంగంగా సర్దిచెప్పుకుంటున్నారట. మొత్తమ్మీద అధిష్ఠానం ఇచ్చిన టాస్క్ పూర్తి చేయడానికి సకల ప్రయత్నాలు చేస్తున్నారట చిత్తూరు జిల్లా నేతలు.

# గంటాకు దారేది...



విశాఖపట్నం, జూన్ 8, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు రాజకీయ దారి ఏదన్నది ఇంకా తేలలేదు. ప్రస్తుతం ఆయనకు తెలుగుదేశం పార్టీలో ప్రాధాన్యత లభించడం లేదు. దాదాపు మూడేళ్ల పార్టీని పట్టించుకోక పోవడంతో చంద్రబాబు గంటా శ్రీనివాసరావుపై సీరియస్ గా ఉన్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర పర్యటనకు వెళ్లినప్పుడు గంటా శ్రీనివాసరావు విశాఖకు ఎయిర్ పోర్టు వచ్చినా ఆయనను చంద్రబాబు పెద్దగా పట్టించుకోలేదు. దీనికి కారణం పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఆయన దూరంగా ఉండటమే కారణమంటున్నారు. గంటా శ్రీనివాసరావు ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారు. ఆయన టీడీపీలో ఉన్నారా? లేదా? అన్నది ఆయనకు కూడా తెలియదు. మొన్నటి వరకూ ఆయన శాసనసభలో కూడా పెద్దగా టీడీపీ చేసే ఆందోళనలకు మద్దతుగా నిలిచేవారు కాదు. అసెంబ్లీ సమావేశాలకు ఇటీవల హాజరుకావడం లేదు. ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం రాజీనామా చేయడంతో శాసనసభకు కూడా రావడం మానేవారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న గంటా శ్రీనివాసరావు ఇటీవల కాలంలో కొంత దగ్గరవుతున్నారు. పొత్తులపై జనసేన అధినేత ప్రకటన చేసిన తర్వాత ఆయన తిరిగి యాక్టివ్ అయ్యారు.... అయితే చంద్రబాబు మాత్రం గంటా శ్రీనివాసరావును నమ్మడం లేదు అనే కన్నా ఇష్టపడటం లేదు. అందుకే ఆయనను దూరంగా ఉంచుతున్నారు. ఇప్పుడు జనసేనలోకి వెళ్లాలా? టీడీపీ లో కొనసాగాలా? అని గంటా శ్రీనివాసరావు మదన పడుతున్నారు. జనసేనకు ఉ త్తరాంధ్రలో పెద్దగా నాయకులు లేరు. అయితే పవన్ కల్యాణ్ గంటాను పార్టీలోకి చేర్చుకోవడానికి ఇష్టపడటం లేదని చెబుతున్నారు. తన అన్న చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడంలో గంటా శ్రీనివాసరావు కీలక భూమిక పోషించారని అంటున్నారు. అయితే అన్ని రకాలు బలమైన గంటా శ్రీనివాసరావును వదులుకోవడం ఎందుకని కొందరు నేతలు పవన్ కల్యాణ్ కు సూచిస్తున్నట్లు తెలిసింది. గంటా శ్రీనివాసరావు జనసేనలో చేరి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అవుతున్నారు. చిరంజీవితో తనకున్న సంబంధాలను ఆయన ఉపయోగించుకుంటారని చెబుతున్నారు. టీడీపీలో మాత్రం గంటాకు పెద్దగా ప్రాధాన్యత లేదన్నది వాస్తవం. టీడీపీలో ఆయన కూడా కొనసాగడానికి ఇష్టపడటం లేదంటున్నారు. జనసేనలోకి వెళ్లేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# రష్యా ఆధీనంలోకి డోన్‌బాస్ ప్రాంతం

మాస్కో, జూన్ 8, (న్యూస్ పల్స్)ఉక్రెయిన్‌పై మూడు నెలలకుపైగా యుద్ధం కొనసాగిస్తోన్న రష్యా.. తాజాగా డోన్‌బాస్ ప్రాంతం 97 శాతానికి పైగా తమ నియంత్రణలోకి వచ్చిందని మంగళవారం ప్రకటించింది. ముఖ్యంగా లుహాన్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా స్వాదీనం చేసుకున్నామని చెప్పిన రష్యా రక్షణ మంత్రి సెర్గీ షొయిగూ.. పొపాస్నా, లీమన్, స్వియాటోహిర్స్క్ సహా 15కు పైగా నగరాలు తమ చేతికి చిక్కినట్లు వెల్లడించారు. అటు ఉక్రెయిన్ సైతం.. డొనెట్స్క్‌లో సగం ప్రాంతం రష్యా చేతుల్లోకి వెళ్లిపోయిందని అంగీకరించింది. అయితే.. ఈ ఎదురుదెబ్బలకు కుంగిపోవద్దని, వీధి పోరాటాలతో కోల్పోయిన భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంటామని డోన్బాస్‌వాసులకు ఉక్రెయిన్ పిలుపునిచ్చింది.ఇదిలావుండగా.. ఖెర్సన్, జపోరిజియా ప్రాంతాల్ని స్వాధీనం చేసుకున్నట్టు రష్యా ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే! ఈ నేపథ్యంలోనే తూర్పు ఉక్రెయిన్‌కు మరింత సైన్యాన్ని తరలిస్తోంది. పశ్చిమ దేశాలు సైతం ఉక్రెయిన్‌కు సహకారం అందించడం కోసం అత్యాధునిక ఆయుధాల్ని అందిస్తున్నాయి. అటు.. అమెరికా అందించిన అత్యాధునిక మల్టిపుల్ రాకెట్ లాంచర్ల వాడకంపై సైన్యానికి ఉక్రెయిన్ శిక్షణ ఇస్తోంది. మరోవైపు.. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌ని స్వాధనం చేసుకోవాలని రష్యా సేనలు విశ్వప్రయత్నాలు చేయగా.. ఉక్రెయిన్ సేనల ప్రతిదాడులతో తిరిగి వెనక్కి వెళ్లిపోయాయి.

# తెలంగాణ సరే.. ఆంధ్రా సంగతేంటీ

విజయవాడ, జూన్ 8, తెలంగాణ బీజేపీపై శ్రద్ధ పెట్టినట్లు ఏపీపై ఆ పార్టీ పెద్దగా ఫోకస్ పెట్టలేదనే అనిపిస్తుంది. జేపీ నడ్డా లాంటి నేతలు వచ్చినా వారు ప్రజలను ఆకట్టుకునేంత స్థాయి నేతలు కాదు. తెలంగాణలో గెలుపునకు అవకాశాలుండటం, అక్కడ పార్టీ రోజురోజుకూ బలోపేతం అవ్వుతుండటంతో మోదీ నుంచి అమిత్ షా వరకూ అక్కడ దష్టి పెట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో స్వయంగా అమిత్ షా పాల్గొనడం, మోదీ జీహెచ్ఎంసీ కార్పొరేటర్లతో సమావేశం కావడం ఇందుకు ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్ కు జేపీ నడ్డా వచ్చినా నామమాత్రమే అని చెప్పాలి. ఇక్కడ పార్టీ బలోపేతం అవుతుందన్న నమ్మకం అధినాయకత్వానికి లేదు. ఏపీలో ఓటు బ్యాంకు బీజేపీకి లేకపోవడమే ఇందుకు కారణమని చెప్పకతప్పదు. రాజ్యసభ స్థానాల్లో సయితం ఏపీలో నేతలను పార్టీ హైకమాండ్ పట్టించుకోలేదు. తెలంగాణలో ఓబీసీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ కు యూపీ నుంచి రాజ్యసభ స్థానాన్ని కేటాయించారు. రాజ్యసభ స్థానాలను.... ఎన్నికలు జరగబోయే కర్ణాటక వంటి రాష్ట్రాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. కానీ రాజ్యసభ సభ్యుల ఎంపికలో ఏపీని పార్టీ హైకమాండ్ పూర్తిగా విస్మరించింది. ఇక్కడ సీనియర్ నేతలు ఉన్నప్పటికీ వారి జోలికే పోలేదు. నిజానికి పార్టీని బలోపేతం చేయానికి సుజనా చౌదరి, టీజీ వెంకటేష్ కి ఈసారి రాజ్యసభ స్థానం దక్కుతుందని భావించారు. పోనీ అదే సామాజికవర్గానికి చెందిన పురంద్రీశ్వరికి అయినా చోటు దక్కుతుందని అనుకున్నారు. కానీ ఏపీలో ఏ నేతకు రాజ్యసభ స్థానం దక్కలేదు ఇందుకు కారణాలు కూడా లేకపోలేదు. ఏపీలో జనసేనతో పొత్తుతో వచ్చే ఎన్నికలకు వెళతామా? లేదా? అన్నది కూడా హైకమాండ్ కు సందేహంగానే కన్పిస్తుంది. జనసేన చివరి నిమిషంలో హ్యాండ్ ఇచ్చినా ఇవ్వవచ్చు. టీడీపీతో కలసి వెళ్లాల్సిన అవసరం లేదన్నది బీజేపీ అగ్రనేతల అభిప్రాయం. మరో వైపు కాంగ్రెస్ కు పూర్తి వ్యతిరేకంగా ఉన్న జగన్ ఎటూ తమకు 2024 ఎన్నికల ఫలితాల తర్వాత మద్దతు ఇచ్చే అవకాశముంది. ఈ పరిస్థితుల్లో రాజ్యసభ స్థానాలను ఏపీకి కేటాయించి వాటిని వేస్ట్ చేసుకోవడం ఎందుకన్న ధోరణిని హైకమాండ్ ప్రదర్శించినట్లు కనపడుతుంది. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో కిషన్ రెడ్డి ఉన్నారు. ఏపీ నుంచి ఒక్కరూ లేరు. అలా ఏపీని బీజేపీ అగ్రనేతలు పక్కన పెట్టేశారనే చెప్పాలి.

# మళ్లీ చీలిపోనున్న వ్యతిరేక ఓటు

విజయవాడ, జూన్ 8,పవన్ కామెంట్లు టీడీపీని డిఫెన్సులో పడేసినట్టే కన్పిస్తోంది. పార్టీ ఆవిర్భావ సభలో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా జాగ్రత్త పడతాననే పవన్ కామెంట్లతో, తమతో కలిసి పని చేయడానికి సంసిద్ధతను పవన్ తన కామెంట్ల ద్వారా తెలిపారని జనమంతా భావించారు. అదే తరహాలో టీడీపీ కూడా అనుకుంది. ఆ తర్వాత ఒకట్రెండు సందర్భాల్లో కూడా పవన్ ఇదే తరహాలో మాట్లాడితే పొత్తు పక్కా అని తమ్ముళ్లు ఫిక్స్ అయినట్టే కన్పించారు. చంద్రబాబు ఏం కోరుకుంటున్నారో, దానికి అనుగుణంగానే పవన్ స్పందించారు కాబట్టి.. పొత్తులపై స్పష్టత వచ్చేసినట్టేనని అనుకున్నారు. అయితే జనసేన విస్తృత స్థాయి సమావేశంలో పవన్ కళ్యాణ్ చేసిన కామెంట్లు, టీడీపీ షాక్ గురయ్యేలా చేశాయనే చెప్పాలి. ఇన్నాళ్లూ తాము తగ్గామని.. ఇకపై తాము తగ్గేదే లేదని చెప్పడమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో టీడీపీ తగ్గితే బాగుంటుందని పవన్ అనడంతో టీడీపీ ఒక్కసారిగా షాక్ కు గురైంది. పవన్ అలా ఎందుకన్నారు? అసలేం జరుగుతుందో అనేది టీడీపీకి అర్థం కావడం లేదట.ఇప్పుడు దీనిపై విశ్లేషించుకునే పనిలో పడ్డాయి టీడీపీ వర్గాలు. అసలు పవన్ ఈ తరహా కామెంట్లు ఎందుకు చేశారన్న దానిపై ఆరా తీసే ప్రయత్నం చేస్తున్నారట తమ్ముళ్లు. ఇటీవల కాలంలో చంద్రబాబు చేసిన కామెంటే పవన్ తాజా సంచలనానికి కారణం అనే చర్చ, ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. గతంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ తో పొత్తును కోరుకుంటున్నామనే సంకేతం ఇస్తూ, మనది వన్ సైడ్ లవ్ అనే కామెంట్ చేశారు. ఇక ఇటీవలి కాలంలో జరిగిన మహానాడు సక్సెస్ తర్వాత ప్రభుత్వాన్ని, వైసీపీని ఉద్దేశించి వార్ వన్ సైడ్ అనే కామెంట్ చేశారు బాబు. ఇప్పుడీ కామెంటే పవన్ తగ్గేదేలే కామెంటుకు కారణంగా కన్పిస్తోందనే చర్చ జరుగుతోంది. వార్ వన్ సైడ్ అంటే తమను కూడా పట్టించుకోకుండా, ఎన్నికలకు వెళ్తామని చంద్రబాబు చెప్పారనేది జనసేనలో జరుగుతోన్న చర్చ. తమ అవసరం లేదనే రీతిలో చంద్రబాబు.. టీడీపీ వ్యవహరిస్తున్నప్పుడు, తామేమీ టీడీపీ వెంట పడడం లేదనే విషయాన్ని టీడీపీకి అర్థమయ్యేలా చెప్పడంతో పాటు, ఆ పార్టీకి ఓ ఝలక్ ఇవ్వడానికే పవన్ ఈ తరహా కామెంట్ చేశారా అనే చర్చ టీడీపీలో జరుగుతోందట.చంద్రబాబు వార్ వన్ సైడ్ కామెంట్ పవన్ ఉద్దేశించి కాదని అంటున్నారు కొందరు తమ్ముళ్లు. ఇదే సందర్భంలో పవన్ కామెంట్లపై వీలైనంత వరకు మౌనం పాటిస్తేనే మంచిదని అంటున్నారు. మహానాడు తర్వాత ఒంటరిగా ఎన్నికలకు వెళ్లినా, గెలుస్తామనే ధీమా చాలామంది కార్యకర్తల్లో ఉన్నా, నేతల్లో కాన్ఫిడెన్స్ కన్పించినా.. రిస్క్ తీసుకోకూడదనేది చాలామంది టీడీపీ నేతల భావన. పైగా ఎన్నికలకు మరో రెండేళ్లు టైమ్ ఉండడంతో, ఏం జరిగినా జరగొచ్చనే భావన కూడా ఉంది. దీంతో పవన్ విషయంలో వీలైనంత వరకు సంయమనం పాటిస్తే మంచిదనే చర్చ పార్టీలో సాగుతోంది. ఈ క్రమంలోనే పవన్ కామెంట్ల విషయంలో టీడీపీ నుంచి పెద్దగా స్పందనల్లేవు.ప్రభుత్వ వ్యతిరేకత వున్నా, అది ఎంత వరకు కలిసి వస్తుందన్న డౌట్ టీడీపీ వర్గాల్లో వుంది. 2014లో పవన్ కాంబినేషన్ కలిసి వచ్చింది. ఇప్పుడు అదే కలిసి వచ్చే అవకాశం వుందని కొందరి అంచనా. పొత్తుల లెక్క వేరు, ఇప్పుడు పవన్ పెడుతున్న ఆప్షన్లు, షరతులు వేరు. టీడీపీ తగ్గడం అంటే తనను సీఎం చెయ్యడం అనేది పవన్ మాటలకు అర్థమని కొందరు టీడీపీ నేతలంటున్నారు. అదే నిజమైతే, పొత్తుల సమస్యను పరిష్కరించడం టీడీపీకి సమస్యే. అందుకే వీలైనంత వరకు కొన్నాళ్లు మౌనంగా వుండటమే మేలని టీడీపీ భావిస్తోంది.

# క్రికెట్ అభిమానులకు నిరాశ

విశాఖపట్నంఎంతో ఆశతో ఎదురు చూసిన భారత్, దక్షిణాఫ్రికా టి20 టిక్కెట్ల విక్రయాలపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌంటర్ ప్రారంభిం చిన కొద్ది సేపటికే 600 రూ టిక్కెట్లు అయిపోయాని చెప్పడంతో అసహనం వ్యక్తం చేశారు.స్వర్ణ భారతీ స్టేడియం లో క్యూలైన్లలో 600 రూపాయల టిక్కె ట్ల కోసం అభిమానులు పడిగాపులు కాసారు.టిక్కెట్లను దారి మళ్లించి తమకు కావాల్సిన వారికి ఇచ్చుకున్నారనీ ఆరోపిస్తున్నారు. ఉ దయం నుంచి పడిగాపులు కాసిన వారిని కాదని వేరెవరికో ఇచ్చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు స్వర్ణభారతీ ఇండోర్ స్టేడియం కౌంటర్ లో టిక్కెట్ల ప్రింటింగ్ లో సమస్యలు తలెత్తాయి. సర్వర్ మొరాయిం చడంతో టిక్కెట్ విక్రయాలు నిలిచిపోయాయి. దీంతో క్రికెట్ అభిమానులు తీవ్ర నిరాశ చెందారు.

# సీసీటీవీ ఫుటేజ్ ప్లస్సే కాదు.. మైనస్ కూడా

ఏలూరు, జూన్ 8, ఓ ఇంటికి ఉన్న సీసీ కెమెరాలే ఆ కుటుంబం పాలిట శాపంగా మారాయి. ఎందుకు సీసీ కెమెరాలు పెట్టామా అనేటట్టుగా వారి జీవితం అగమ్యగోచరంగా మారింది. సీసీ కెమెరా ఫుటేజ్ తో పోలీసులకు సహాయం చేసినా, వారు తమకు రక్షణ కల్పించటంలో విఫలమయ్యారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు న్యాయం చేయకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్యే శరణ్యమంటున్నారు. ఇంతకు ఏం జరిగింది.. సీసీ కెమెరాల ఏర్పాటుతో ఆ కుటుంబానికి కలిగిన నష్టం ఏంటి..? పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణం పాతురు గమినీవారి వీధిలో దుర్గ భవాని తన భర్త, పిల్లలతో నివాసముంటున్నారు. జీవనోపాధి కోసం కర్రీ పాయింట్ నడుపుతున్నారు. తమ రక్షణ కోసం వారు నివసిస్తున్న ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే 8 నెలల క్రితం ఆ ప్రాంతం లో హత్య జరిగింది. దీంతో పోలీసులు దుర్గ భవాని వద్ద నుండి సీసీటీవీ ఫుటేజ్ కావాలని కోరారు. అయితే ఆమె సీసీ కెమెరా విజువల్స్ పోలీసులకు ఇవ్వడం వల్ల తనకు ఏదైనా సమస్య వస్తుందని భయపడింది. కానీ పోలీసులు మేమున్నాం మీరు భయపడాల్సిన అవసరం లేదని చెప్పి సీసీ కెమెరాలు విజువల్స్ తీసుకెళ్లారు. అయితే ఆ సీసీ కెమెరా ఆధారంగా నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అప్పట్నుంచి నిందితుడి బంధువులు దుర్గ భవాని కుటుంబంపై కక్ష పెంచుకుని దాడులకు తెగబడ్డారు. బాధితురాలు దుర్గ భవాని పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయింది. ఈ నేపథ్యంలో దుర్గ భవాని కుటుంబంపై గత రెండు రోజులుగా ప్రత్యర్థి వర్గం దాడులకు తెగబడి ఇటుక రాళ్లతో దాడి చేశారు. దుర్గ భవానిని సైతం మహిళ అని చూడకుండా దాడికి తెగబడ్డారు. అంతేకాక వారి ఇంటి ఎదురుగా బైకులు అడ్డుపెట్టి చంపేస్తామని బెదిరిస్తున్నారంటూ బాధితురాలు వాపోయింది. రాజకీయ నేపథ్యంలో వారి ఓట్లు ఎక్కడ పోతాయో అనే కారణంతో రాజకీయ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని, పోలీసులు కూడా వారి ఒత్తిళ్లకు తలొగ్గి మాకు న్యాయం చేయకపోగా, తిరిగి మా పైన కేసులు పెడుతున్నారని ఆరోపించింది. రెండు రోజుల క్రితం దాడి జరిగినప్పుడు దిశ యాప్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశానని, అయితే పోలీసులు ఎందుకు దిశ యాప్ కు ఫోన్ చేశావని, పరిగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్ కు ఎందుకు రాలేదని తన పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు బాధితురాలు దుర్గ భవాని ఆరోపిస్తోంది. తమ రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు తమ పాలిట శాపంగా మారాయని, పోలీసులకు సహాయం చేసినందుకు తిరిగి సహకరించకపోగా తమపై దాడులు చేస్తున్న వారికి కొమ్ము కాయడం ఎంతవరకు సమంజసమని బాధితురాలు దుర్గ భవాని ప్రశ్నిస్తుంది. అయితే, దీనిపై పోలీసులు వేరే రకంగా చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది. దానయ్య అనే వ్యక్తి తల్లి బట్టలు ఉతుకుతూ ఉన్న సమయంలో దుర్గ భవాని భర్త వెంకన్న సీసీ కెమెరాలతో వీడియో చిత్రీకరించాడని, దీంతో దానయ్య వెంకన్న కుటుంబంపై ఇటుక రాళ్లతో దాడి చేశాడని, ఆ దాడిలో వెంకన్న తో పాటు అతని కుటుంబ సభ్యులు గాయపడ్డారని, హాస్పటల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అంతేకాక దానయ్య పై వెంకన్న ఇటుక రాయి తో దాడి చేసినట్లు ఫిర్యాదు చేయగా దానిపై కూడా కేసు నమోదు చేశామని, ఇరువురు ఇదేవిధంగా ఘర్షణలకు దిగితే ఎమ్మార్వో దగ్గర బైండోవర్ చేస్తామని ఎస్సై వీరబాబు తెలిపారు.

# రాజమండ్రి సీటుపై జయప్రద గురి



రాజమండ్రి, జూన్ 8, బీజెపి సీనియర్ రాజకీయ నాయకురాలు, సినీనటి జయప్రద తెలుగు రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారా..? తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై తాను ఆసక్తితో ఉన్నట్టు సినీ నటి జయప్రద ఇప్పటికే చాలా సార్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.. మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు రాజమండ్రీలో జరిగిన బహిరంగ సభలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాజమండ్రి నా స్వస్థలం.. ఇక్కడి నుంచే దేశ రాజకీయాల్లోకి వెళ్లాను. మన ఊరు, మనవాళ్లను వదిలి వెళ్లినందుకు క్షమించండి అంటూ తెలుగు ప్రజలను కోరారు. ఇక తాను తెలంగాణ లేదా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రియాశీలకంగా మారాలనుకుంటున్నట్లు తన మనసులోని మాట చెప్పారు. అయితే ఆమె ఏపీ రాజకీయాలవైపే ప్రధానంగా ఆసక్తితో ఉన్నట్టు సమాచారం. సినీరంగంలో ఓ వెలుగు వెలిగిన జయప్రద ఆ తర్వాత రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేశారు. తెలుగింటి ఆడబిడ్డగా మొదలుపెట్టిన ప్రస్థానం జాతీయస్థాయిలోనూ చాటగలిగింది. తెలుగుదేశంతో ప్రారంభమైన ఆమె మనుగడ.. ఆ తర్వాత సమాజ్ వాదీ పార్టీలో చేరారు. ఆ తర్వాత ఆ పార్టీని వీడి 2019లో బీజేపీలో చేరిన జయప్రద.. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ పార్టీ క్యాడర్‌లో ఉన్నందున తెలంగాణా లేదా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చేరే విషయంలో పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల్లోకి రావడానికి తనను అనుమతించాలని బీజేపీ అధిష్టానాన్ని అభ్యర్థిస్తానని నటి జయప్రద గతంలో ఒకసారి చెప్పిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రికి చెందిన జయప్రద తన గత 28 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక పార్టీలు మారారు. 1994లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టిఆర్ ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ లో చేరడం ద్వారా ఆమె తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ నుంచి పార్టీ పగ్గాలను చంద్రబాబు చేతిలోకి తీసుకున్న తర్వాత చంద్రబాబు నాయుడు 1996లో జయప్రదను రాజ్యసభ సభ్యురాలిగా.. పార్టీ మహిళా విభాగం నాయకురాలిగా నియమించారు. చంద్రబాబు మరో నటి రోజాను మహిళా విభాగం చీఫ్‌గా చేయడంతో వారి మధ్య విభేదాలు రావడంతో బయట వెళ్లినట్లుగా రాజకీయాల్లో ప్రచారంలో ఉంది. ఆ తర్వాత అమర్ సింగ్, ములాయం సింగ్ ఆహ్వానం మేరకు ఆమె సమాజ్ వాదీ పార్టీ లో చేరారు. ఆమె 2004లో రాంపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. మళ్ళీ 2009లో తిరిగి ఎన్నికయ్యారు. ములాయం సింగ్‌పై తిరుగుబాటు చేసిన తర్వాత జయప్రద అమర్ సింగ్ పక్షాన నిలిచారు. 2010లో ఎస్పీ నుంచి బహిష్కరించబడిన జయప్రద.. అమర్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మంచ్‌లో చేరారు. అయితే, ఉత్తరప్రదేశ్‌లో పార్టీ ఎటువంటి ప్రభావం చూపలేకపోయింది. ఆ తర్వాత 2014లో అమర్ సింగ్‌తో పాటు జయప్రద అజిత్ సింగ్ నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ దళ్ (ఖీఒఆ)లో చేరారు. జయప్రద ఆర్ ఎల్ డి అభ్యర్థిగా బిజ్నోర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు పోటీ చేసినప్పటికీ నాల్గవ స్థానంలో నిలిచింది. అయితే, 2019 లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆమె బీజేపీలో చేరారు. 1998, 1999లో బీజేపీ గెలిచిన రాజమండ్రి లోక్‌సభ స్థానం నుంచి ఆమెను బరిలోకి దింపవచ్చని ఊహాగానాలు వినిపించాయి. అయితే బిజెపి ఆమెకు టిక్కెట్ ఇవ్వలేదు. 2024 ఎన్నికల్లో రాజమండ్రి నుంచి పోటీ చేసేందుకు జయప్రద ఆసక్తి చూపుతున్నట్లు ఆమె తాజా వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

# తల్లిని కడతేర్చిన కొడుకు

శ్రీకాకుళం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం కె గోపాలపురం గ్రామంలో తల్లిని చంపిన కుమారుడు సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి బోస్ భాగ్యవతి రామారావు అని వృద్ధ దంపతులు గోపాలపురం గ్రామంలో నివాసముంటున్నారు. కుమారుడు శ్రీనివాస్ రావు పాతపట్నం లో ఉంటున్నాడు మంగళవారం రాత్రి తల్లిదండ్రుల వద్దకు వచ్చిన శ్రీనివాసరావు ఎవరు లేని సమయంలో తల్లిదండ్రులపై రాత్రి సమయంలో దాడి చేశాడు. కత్తితో తల్లిదండ్రుల పై గాయపరిచాడు. తల్లి కి తీవ్ర గాయాలు కావడంతో ఇంట్లోనే మృతి చెందింది. వేకువ జామున శ్రీనివాసరావు గ్రామంలో పలువురు కి ఫోన్ చేసి తల్లిదండ్రులు గాయపరిచి నట్లు తెలియజేశాడు. పలువురు ఇంట్లో కి వెళ్లి చూడగా అప్పటికే భాగ్యలక్ష్మి మృతి చెందింది. గాయపడిన రామారావును గ్రామస్తులు సామాజిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. జరిగిన సంఘటనపై సీఐ వినోద్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేస్తున్నారు.

# దెందులూరులో అదుపులో అల్లర్లు

దెందులూరు మంగళవారం రాత్రి అల్లర్లతో అట్టుడిగిన దెందులూరు లో పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాకు అదనపు బలగాలు తరలించారు. దెందులూరు గ్రామం పరిధిలో పికెట్లు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసారు. అనుమానితులు ఎవరు గ్రామంలో ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ స్వయంగా భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. రాత్రి జరిగిన అల్లర్లకు బాధ్యులను కనిపెట్టే పనిలో స్పెషల్ టీం వుంది. ఎటువంటి అల్లర్లు జరగకుండా గ్రామాన్ని అదుపులోకి తీసుకున్నారు.

# బడ్డీకొట్టుకు నిప్పు పెట్టిన అగంతుకుడు

నందిగామ చందర్లపాడు పోలీస్ స్టేషన్ ముందు బడ్డీకొట్టును గుర్తు తెలియని వ్యక్తి దగ్ధం చేసాడు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో పోలీస్ స్టేషన్ ముందు బడ్డీకొట్టు పై పెట్రోల్ పోసి నిప్పు అంటించటంతో కొట్టు గ్ధం అయింది. కొట్టు దగ్ధం అవుతున్న విషయం తెలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన హెడ్ కానిస్టేబుల్ దాసుకు గాయాలు అయ్యాయి. పక్కనే పెట్రోల్ బంక్ ఉండటం తో స్థానికులు భయాందోళనలకు గురి అయ్యారు. సీసీ టీవీ ఫుటేజ్ లో ఒక వ్యక్తి షాపు దగ్ధం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చందర్లపాడు పోలీసులు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# లారీని ఢీకొన్న బస్సు..నలుగురికి గాయాలు

గుంటూరు గుంటూరు జిల్లా తాడేపల్లి నేషనల్ హైవే పై రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం తెల్లవారుజామున చెన్నై నుంచి కాకినాడ వెళ్తున్న ఆర్టీసి బస్సు కొలనుకొండ సాయి బాబా ఆలయం వద్ద ఆగి ఉన్న లారీ నీ ఢీ కొట్టింది. బస్సు డ్రైవర్ కు ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



# అలలపై ఆహ్లాదం

**విహార నౌకలో వినోదం**
**విశాఖనుంచి ప్రారంభమయిన క్రూయిజ్ సేవ**







విశాఖపట్నం విహార ప్రపంచానికి విశాఖ నగరం స్వాగతం పలుకుతోంది. పర్యాటక రంగంలో అద్భుతమైన క్రూయిజ్ సేవలకు భారీ క్రూయిజ్ నౌక వస్తోంది. సాగర జలాల్లో మూడు రోజులు కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేసేందుకు సకల సౌకర్యాలతో 11 అంతస్తుల క్రూయిజ్ షిప్ ఎంప్రెస్ విశాఖకు రాబోతోంది. జూన్ 8వ తేదీన తొలి సర్వీస్ మొదలయింది. ఈ నౌక వైజాగ్ నుంచి పుదుచ్చేరి, చెన్నై మీదుగా తిరిగి వైజాగ్ చేరుకుంటుంది. ఎంప్రెస్ విదేశీ విహార నౌక అయినప్పటికీ భారత్లో మాత్రమే తిరిగేలా నిర్వాహకులు అనుమతులు పొందారు. ఈ కారణంగా షిప్ ఎక్కాలంటే పాస్పోర్ట్ అవసరం లేదు. కస్టమ్స్ తనిఖీలు ఉండవు. గతంలో వైజాగ్కు ఒకట్రెండు క్రూయిజ్ షిప్లు ఒక్కసారి మాత్రమే వచ్చి వెళ్లాయి. అవి రెగ్యులర్ సర్వీసులు కావు. ఎంప్రెస్ మాత్రం ప్రస్తుతం రెగ్యులర్ సర్వీసులు నడుపుతున్నట్లు ప్రకటించింది. డిమాండ్ను బట్టి సర్వీసులు కొనసాగించాలా వద్దా అన్నది ఆలోచిస్తారు. ఎంప్రెస్లో విహరించాలనుకునే పర్యాటకులకు వివిధ సర్వీసులు, ప్యాకేజీలు ఉంటాయి. పర్యాటకులు ఎంచుకునే సర్వీస్, ప్యాకేజీల ప్రకారం చార్జీలు నిర్ణయించారు. ప్రస్తుతం విశాఖ ? చెన్నై టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఫ్యామిలీలో ముగ్గురు ప్రయాణించాలంటే మొదటి ఇద్దరికీ ఒకే విధమైన టికెట్ ధర ఉంటుంది. మూడో వ్యక్తికి కాస్త తగ్గుతుంది. జీఎస్టీ అదనంగా వసూలు చేస్తారు. ఈ క్రూయిజ్లో 796 క్యాబిన్లున్నాయి. 313 ఇన్సైడ్ స్టేట్ రూమ్స్, 414 ఓషన్ వ్యూ రూమ్స్, 63 బాల్కనీ రూమ్స్, 5 సూట్ రూమ్లతో పాటు ఒక లగ్జరీ సూట్ రూమ్ ఉంటుంది. ఎంప్రెస్ ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంది. మొత్తం 11 అంతస్తులున్న ఈ భారీ నౌకలో ఒకేసారి 1,840 మంది ప్రయాణించవచ్చు. ఇందులో ఫుడ్ కోర్టులు, 3 స్పెషాలిటీ రెస్టారెంట్లు, 5 బార్లు, స్పా, సెలూన్, థియేటర్, నైట్ క్లబ్, స్విమ్మింగ్ పూల్స్, ఫిట్నెస్ సెంటర్లు, డీజే ఎంటర్టైన్మెంట్, లైవ్ బ్యాండ్, అడ్వెంచర్ యాక్టివిటీస్, షాపింగ్ మాల్స్, లైవ్షోలు ఉన్నాయి. చిన్నారుల కోసం ప్రత్యేక ఫన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. టికెట్ తీసుకున్న అందరికీ షిప్లోని క్యాసినో వరల్డ్కు ఎంట్రీ ఉచితం. లిక్కర్, ఇతర సర్వీసులకు అదనపు చార్జీలు ఉంటాయి. వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో జూన్ 8వ తేదీన ఎంప్రెస్ నౌక విశాఖ పోర్టుకు చేరుకుంటుంది. ఆరోజు నౌకలో వచ్చిన వారికి నగరంలోని పలు పర్యాటక ప్రాంతాలు, సందర్శనీయ స్థలాలను చూపిస్తారు. అదే రోజు రాత్రి 8 గంటలకు కొత్త పర్యాటకులతో విశాఖ పోర్టు నుంచి బయల్దేరుతుంది. జూన్ 10 వ తేదీ ఉదయం 7 గంటలకు పుదుచ్చేరి చేరుకుంటుంది. 10వ తేదీ రాత్రి 7 గంటలకు బయల్దేరి 12వ తేదీన చెన్నైకి చేరుకుంటుంది. 13వ తేదీ ఉదయం చెన్నైలో బయల్దేరి 15వ తేదీన తిరిగి విశాఖ చేరుకుంటుంది. మళ్లీ 15వ తేదీన విశాఖ నుంచి బయల్దేరుతుంది. అదే విధంగా 22వ తేదీన కూడా విశాఖ నుంచి సర్వీసు నడిపేలా టూర్ ప్లాన్ సిద్ధం చేశారు. విశాఖ నుంచి చెన్నై వరకు ఒకవైపు టిక్కెట్ ఇస్తారు. చెన్నై నుంచి నౌకలోనే తిరిగి రావాలనుకొనేవారికి అదనపు చార్జీలు వసూలు చేస్తారు.

# పల్నాడు జిల్లా వినుకొండ

**కడప ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునీకరణకు చర్యలు**
**జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు**
**ప్రజా రవాణా వ్యవస్థ లో ఆర్టీసీ సేవలు ఉత్తమం**



కడప, కడప ఆర్టీసీ బస్ స్టేషన్ ఆదునికరణకు చర్యలు ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఆర్టీసీ బస్ స్టేషన్ ఆధునికీకరణ, అభివృద్ధి పై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...కడప బస్ స్టేషన్ సముదాయములో గల 13 ఎకరముల ఖాళీ స్థలమును వాణిజ్యపరంగా అభివృద్ధి చేసేందుకు నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ వారితో కలసి చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి (ఆర్టీసీ ఆర్.ఎం) గోపాల్ రెడ్డి ను ఆదేశించారు. కడప బస్ స్టేషన్ లోని ఖాళీ స్థలములో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం నందుఅధునాతన బస్ స్టేషన్ కట్టి, పై అంతస్తులలో మాల్స్, హోటేల్స్, మోడరన్ డిజిటల్ సినిమా హాల్స్, మల్టీప్లెక్స్ నిర్మించేందుకు ప్రణాళికలనురూపొందించాలన్నారు. అలాగేకడప బస్ స్టేషన్ లోని ఖాళీ స్థలము యొక్క అభివృద్ధి తో పాటు, కొప్పర్తి లోని 150 ఏకరాలలో ఎకనామిక్ కారిడార్ తో అనుసంధానము చేయగల అవకాశాలను పరిశీలించి తగిన ప్రణాళికను రూపొందించుకొని తదుపరి సమావేశానికి రావాలని నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ వారి తరుపున హాజరైన ఎల్.ఎల్.ఎల్ గ్రూప్ కన్సల్టెంట్ శ్రీనివాసన్ కు కలెక్టర్ సూచించారు. అంతకుముందు కలెక్టర్ ఆదేశాల మేరకు .జె ఎల్.ఎల్. కన్సల్టెంట్ శ్రీనివాసన్ కడప బస్ స్టేషన్ ఖాళీ స్థలములోనిసముదాయములను, చుట్టుప్రక్కల గల వాణిజ్య సముదాయములను, కడపలో ముఖ్యమైన ప్రదేశాలను పరిశీలించామన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిల్లా మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ను కలసి ఈ ప్రాజెక్టువివరాలు తెలిపి సహాయ సహకారాలు అందించాలనే విజ్ఞప్తి కి ఆయన సానుకూలంగా స్పందించారని ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈ.ఈ వెంకటరమణ, ఆర్టీసీ డి.ఈ పోతురాజు, డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

**జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు**

కడప పాడా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాల్ లో పాడ అభివృద్ధి పనుల పురోగతిపై సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిసొంతనియోజకవర్గమైన పులివెందులలో అత్యంత ప్రాధాన్యత తో చేపట్టిన పనులను వేగవంతం చేయాలన్నారు. పాడ అభివృద్ధి పనులలో భాగంగా రూపుదిద్దుకుంటున్న రింగ్ రోడ్డు నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, స్లాటర్ హౌస్ ( కబేలా), మార్కెట్లు, ఉల్లి మెల్ల లేక్, హౌసింగ్ కాలనీలలో వీధి దీపాలు, హౌసింగ్ లే ఔట్ లలో లైటింగ్, నగర వనం, తదితర పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, యూజీ కేబుల్స్ ఏర్పాటు, విద్యుత్ సరఫరా సౌకర్యాల కల్పనకు, స్మశాన వాటిక నిర్మాణం, మెయిన్ ఆర్చ్, సంబంధించి పనుల పురోగతిపై అధికారులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో విద్యుత్ సరఫరాకు ముందస్తుగానే ట్రాన్స్ఫార్మర్లు, లైన్ రూట్స్, విద్యుత్ స్తంభాలు తదితరాలను సమకూర్చుకోవాలని అన్నారు. ఉల్లిమెల్ల లేక్, గరుండాల వంక పనులు పూర్తి చేయడమే కాకుండా అత్యంత సుందరంగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. పులివెందల మోడల్ టౌన్ గా తీర్చిదిద్ది అనుకున్న పనులన్నింటినీ.... నిర్దేశిత సమయంలోగా పూర్తిచేసేందుకు అధికారులంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్.ఈ. మహేశ్వర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. శోభ వాలెంటినా, మోడల్ టౌన్ కన్సల్టెన్సీల ప్రతినిధులు, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖల ఈ.ఈ.లు డీఈ లు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 17 నుంచి డిగ్రీ పరీక్షలు

కడప యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం డిగ్రీ కోర్సులు ఇయర్ ప్యాటర్న్ చదివిన విద్యార్థులకు (వన్టైంఆపర్చునిటీ) జూన్ 17వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు విశ్వవి ద్యాలయ పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ ఎన్. ఈశ్వర్ రెడ్డి తెలిపారు. డిగ్రీ మొదటి, చివరి సంవత్సరం వారికి 17 నుంచి, ద్వితీయ సంవత్సరం వారికి 18వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని చెప్పారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మునగల సూర్యకళావతి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అభ్యర్థులు అన్ని పరీక్షలు యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న ఎ. పి. జె అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో జరుగు తాయని తెలిపారు. హాల్ టికెట్లు సంబంధిత కళాశాలల నుంచి పొందాలని తెలిపారు. ఆలానే కొంతమంది ఆన్లైన్లో దరఖాస్తు చేసేక్రమంలో ఫొటో , సంతకం సమర్పించనివారు ఫొటోతోకూడిన ఐడెంటిఫికేషన్ సర్టిఫికెట్ తీసుకువచ్చి పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ కు అందజేయాలని సూచించారు. చదివిన కళాశాలల్లో అలాగే వైవీయూ వెబ్సైట్ లో పరీక్షల టైం టేబిల్ అందుబాటులో ఉందన్నారు.

# మాజీ ఎమ్మెల్యే మక్కెన కి తప్పిన పెను ప్రమాదం

పల్నాడు పల్నాడు జిల్లా వినుకొండ ఏనుగు పాలెం రైల్వే గేటు వద్ద వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు కి పెను ప్రమాదం తప్పింది. అయన తన సొంత గ్రామం అయిన కొటప్ప నగర్ నంద వ్యావసాయ పనులు పరిశీలించడానికి కుమారుడు డాక్టర్ మక్కెన మణికంఠ తో కలిసి వెళుతున్నారు. రైల్ గేటు ఆర్చి వుండడంతో లారీ ముందుకు వెళ్లలేక వెనుక ఆగి ఉన్న మాజీ ఎమ్మెల్యే మక్కెన కారు ను లారీ డి కొట్టింది. దాంతో కారు ముందు భాగం నుజ్జు..నుజ్జు అయ్యింది తండ్రి కొడుకులు తృటిలో పెను ప్రమాదం నుంచి బయట పడ్డారు. . లారీ కారు మధ్యలో వచ్చిన బైకు లారీ కింద పడి నుజ్జు నుజ్జు అయినది. డ్రైవర్ కి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి దెబ్బలు తగలుక పోవడంతో అందరూ ఊపిరి పిల్చుకున్నారు.

# ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి




**ప్రతి ఇంటి నిర్మాణాన్ని స్టేజ్ బై స్టేజ్ సమీక్షించుకోవాలి**
**నాడు నేడు కింద పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం కావాలి**
**ఉపాధి హామిలో కూలీల సంఖ్య మరింత పెరగాలి**
**ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించి రోజువారీ పురోగతి చూపాలి**
**తాగునీటి సమస్యలు రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలి**
**జగనన్న స్వచ్ఛ సంకల్పం పట్ల ప్రజల్లో అవగాహన తీసుకురావాలి**
**జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు**

కర్నూలు ,జూన్ 8: ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి లేఅవుట్ ల వారీగా నియమించిన నోడల్ అధికారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు ఆదేశించారుబుధవారం జడ్పీ మీటింగ్ హాల్లో కర్నూల్ డివిజన్ సంబంధించి అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా అధికారులు డివిజన్ మండల స్థాయి అధికారులతో ఇళ్ల నిర్మాణం,నాడు నేడు,ఉపాధిహామీ పథకం, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, తాగునీటి సమస్య, జగనన్న స్వచ్ఛ సంకల్పం అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఇళ్ళ నిర్మాణం పై సమీక్షిస్తూ, కర్నూల్ డివిజన్లో 10721 ఇళ్లు నిర్మించడం జరుగుతోందని, 62 లేఔట్ లలో 4889 ఇళ్లను, స్వంత స్థలాల్లో 5832 ఇళ్లను నిర్మించడం జరుగుతోందన్నారు. కర్నూల్ డివిజన్లో నాట్ స్టార్టెడ్ స్థాయిలో 74, బి బి ఎల్ కింద 3357 ఇళ్లు ఉన్నాయన్నారు.. ఇళ్ళ నిర్మాణం వేగవంతం అయ్యేందుకు ఒక్కొక్క లేఅవుట్ కు ఒక్కొక్క నోడల్ అధికారిని నియమించామన్నారు. లేఅవుట్ ల వారీగా కలెక్టర్ పురోగతిని సమీక్షించారు .10 రోజులోపు అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు మొదలు కావాలని నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.. లేఅవుట్ ల వారీగా, స్టేజీల వారీగా, ఇళ్ళ వారీగా సమీక్షలు జరగాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్లు మొదలు పెట్టని లబ్ధిదారులకు డి ఆర్ డి ఏ, మెప్మాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు ఇప్పించాలని కలెక్టర్ ఆదేశించారు.. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద 817 ఇళ్ల డేటా కు విఆర్వో అప్రూవల్ పెండింగ్లో ఉందని, త్వరితగతిన అప్రూవల్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్,స్కానింగ్ ప్రక్రియలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.నాడు నేడు కింద పాఠశాలల్లోచేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా 8 పాఠశాలల్లో రివాల్వింగ్ ఫండ్ జనరేషన్ పెండింగ్ లో ఉందని,గురువారం సాయంత్రం లోపు ఈ ప్రక్రియ పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. 685 పాఠశాలలకు గాను 550 పాఠశాలల్లో రివాల్వింగ్ ఫండ్ తల్లిదండ్రుల కమిటీల ఖాతాల్లో జమ అయిందని, పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. 37 పాఠశాలల్లో జరిగిన పనులకు సంబంధించిన ఖర్చును ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు.కర్నూలు డివిజన్లోని వెల్దుర్తి,సి.బెళగల్, గూడూరు, కల్లూరు మండలాల్లో ఉపాధి హామీ కింద 80 శాతం లోపు మాత్రమే కూలీలు వచ్చారని, కూలీల శాతం మరింత పెరగాలని కలెక్టర్ ఆదేశించారు.. మేట్స్ తో రెగ్యులర్ గా మాట్లాడి కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఓర్వకల్లు మండలంలో 219, కర్నూలు మండలం లో 221, వెల్దుర్తి మండలంలో 225 రూపాయలు మాత్రమే వేతనం పడిందని, ఇంకో గంట అదనంగా పని చేయించి 257 రూపాయలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆయా మండలాల ఎంపీడీవో లను ఆదేశించారు.ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించి ప్రతి రోజు ఎంతో కొంత పని జరగాలని, సిమెంట్ సరఫరాలో ఏమైనా ఇబ్బంది వస్తే పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కు కానీ లేదా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీవోలు భవన నిర్మాణాలకు సంబంధించి సంబంధిత మండల స్థాయి అధికారులతో ప్రతిరోజు సమీక్షించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకముందే అప్రమత్తం కావాలని, ఎక్కడ తాగునీటి కొరత లేకుండా చూడాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఇప్పటినుండి నీటి సమస్య ఎక్కడ ఏర్పడకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారుజగనన్న స్వచ్ఛ సంకల్పం కింద ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలని, ఇందులో ప్రజలను భాగస్వాములను చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీ, ఈవో పీఆర్డీలు తడి చెత్త పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామాల్లోని మహిళలు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై అవగాహన కల్పించాలని ఆదేశించారు.. ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో ప్రతి శుక్రవారం ర్యాలీలను నిర్వహించాలని ఆదేశించారు.. 26 మండలాల్లో 26 గ్రామాలు ఎంపిక చేసి వాటిని ముందుగా స్వచ్ఛ గ్రామాలుగా మోడల్గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. గ్రామంలో లెగసీ డంప్ లను ఎత్తివేయాలని, గ్లిట్టరింగ్ హాట్స్పాట్స్ లో డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు..అంతకు ముందు రీ సర్వే,మ్యుటేషన్, సర్టిఫికెట్ ల రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు..సమావేశంలో నందిత జిల్లా సంబంధిత శాఖల జిల్లా అధికారులు,కర్నూలు ఆర్డీవో, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎం ఈ వో లు, ఈవో ఆర్ డి లు, హౌసింగ్ ఇంజనీర్లు, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు, ఆర్ డి డబ్ల్యూ ఈ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధనవంతులు మరియు ఉన్నవారు పేదప్రజలకు ఆహారం అందించండి,

**:- మనీ మదీనా మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాగమణి.**

కర్నూలు ) మే 8, ఈరోజు ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా మనీ మదీనా మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాగమణి, ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మనీ మదీనా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నాగమణి మాట్లాడుతూ ఆహారం యొక్క ప్రాధాన్యత ఆహారం యొక్క విలువ గురించి తన సభ్యులతో చర్చించడం జరిగిందన్నారు, ఎంతో మంది ఆకలితో అలమటిస్తూ ఆకలితో చనిపోతున్నారు, ఆహారం లేనివారికి అందిస్తే వారి ప్రాణాలను కాపాడినట్లు అవుతుందని ఆమె తెలిపారు. మరియు ఈరోజు రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. వారు పండించే పంటకు ప్రభుత్వం తగిన గిట్టుబాటు ధర అందిస్తే సామాన్యులకు కూడా ఆహార ధాన్యాలు కూడా లభిస్తాయి ఆహారం యొక్క విలువ పెరుగుతుందని వివరించారు మరియు ఆహారంలో కూడా నాణ్యత పోషకాల గురించి ఆహార భద్రత గురించి చాలా చక్కగా వివరించి తన తోటి సభ్యులను కూడా ఎంతో ఆకర్షించడం జరిగిందన్నారు. ఆహారంలో ఉన్న పోషక విలువల గురించి ఆహార భద్రత గురించి మరియు సామాన్యులకు ఆహారం యొక్క విలువ గురించి అక్కడ ఉన్న తన సభ్యులకు వివరించరు. ఈ రోజు ప్రపంచంలో చైనా తర్వాత భారత దేశంలో అత్యధిక జనాభా గల దేశం ఏది అంటే భారత దేశం, దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఎంతోమంది ఒక పూటకు, కూడా గడవడానికి చాలా కష్టపడుతున్నారు. కాబట్టి ఇలాంటి వాళ్లు కూడా రోజువారీ కూలి చేసుకుంటూ సామాన్య జీవనం గడుపుతున్నారని అలాంటి వారిని ప్రతి ఒక్కరు ఆదుకోవాలని ఆమె కొరారు.



ప్రపంచంలో ఎంతోమంది ధనవంతులు మరియు ఉన్నావరు కూడా వున్నారు, వారికున్న ఆర్థిక సంపాదనలో కొంత వరకు పేదలకోసం, ఇస్తే పేదలకు మరియు నిరాశ్రయులకు కడుపునిండా రెండు పూటలా అన్నం పెట్ట గలరని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మనీ మదీనా మహిళ సంక్షేమ సంఘం సభ్యులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడీ గా దాసెట్టి శ్రీనివాసులు నియామకం

కర్నూలు జూన్ 8 తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది దాసేట్టి శ్రీనివాసలు నియామకం అయ్యారు. కర్నూలు నగరానికి చెందిన దాసెట్టి గత 30 సంవత్సరాలుగా న్యాయవా దిగ విధులు నిర్వహిస్తూ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా, సెక్రటరీగా, నోటరీగా ఎన్నో పదవులు గతం లో నిర్వహించారు. అనంతరం ఎస్సీ,ఎస్టీ స్పెషల్ పబ్లిక్ ప్రాసి కుటర్ గా విధులు న్యాయస్థానం లో పనిచేశారు. ఒకవైపు తన వృత్తి నిర్వర్తిస్తూనే మరో వైపు తాను పుట్టిన రాయలసీమ ప్రాంత వెనుకబాటు తనాన్ని అంతమొందించాలనే లక్ష్యం తో రాయలసీమ హక్కుల ఐక్య వేదిక ద్వారా రాయలసీమ జిల్లలో పర్యటించి సీమ వెనుకబాటు ను ఎలా ఎదుర్కోవలో ఎన్నో సమీక్ష సమావేశాలు,మేధావుల తో సమావేశాలు నిర్వహించి ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనే లక్ష్య0గా తన కార్యాచరణను రూపొందించుకున్నారు. ప్రసుతం తెలుపుదేశం పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇంచార్జి టీజీ భరత్ అడుగుజాడల్లో ఒక కార్యకర్త గా తెలుగుదేశం పార్టీ ని తిరుగి అధికారం లోకి తీసుకువచ్చేందుకు, టీజీ భరత్ ను కర్నూలు ఎమ్మెల్యే గా చేసేందుకు అహర్నిశలు కృషిచేస్తున్న న్యాయవాదీ దాసెట్టి శ్రీనివాసులు కు తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ లో రాష్ట్ర ఉ పాధ్యక్షుడు గా పదవి దక్కడం తో కర్నూలు తెలుగుదేశం పార్టీ శ్రేణులు , టీజీబీ యూత్ సభ్యులు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెదేపా పెద్దలకు ధన్యవాదాలు... దాసెట్టి.. తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పదవి బాధ్యతలను అప్పజెప్పినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయడు, జాతీయ ఉపాధ్యక్షుడు నారా లోకేష్ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మూందునుంది తన అబివృద్ధి కోసం అన్ని విధాలా సహకరిస్తున్న ప తెలుగు దేశం పార్టీ కర్నూలు అసెంబ్లీ ఇంచార్జి టీజీ భరత్ కుటుంబానికి, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షులకుటీం కు దాసెట్టి ఈ సందర్బంగా ప్రత్యేక కృతజ్ఞతలు ,అభినందనలు తెలిపారు.

# సిద్దేశ్వరం అలుగు గురించి సీయం దృష్టికి తీసుకెళ్లండి

**కలెక్టర్ ను కోరిన రాయలసీమ సాగునీటి సాధన సమితి**

నంద్యాల నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి కలిసి సిద్దేశ్వర అలుగు నిర్మాణ ఆవశ్యకత గురించి వివరించారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణ ఆవశ్యకత గురించి వ్రాసిన లేఖను ముఖ్యమంత్రి కి మీ ద్వారా పంపాలని కోరుతూ కలెక్టరు గారికి లేఖను అందచేసారు. ఈ సందర్భంగా లేఖలోని అంశాలను దశరథరామిరెడ్డి ప్రస్తావిస్తూ సిద్దేశ్వరం దగ్గర అలుగు నిర్మాణం చేపడితే రాయలసీమ ప్రాంతం ఎదుర్కొంటున్న త్రాగు, సాగునీటి కష్టాలను పూర్తిగా నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు.కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టుతో సిద్దేశ్వరం దగ్గర రిజర్వాయర్ నిర్మాణం కొరకు 1932 సంవత్సరంలోనే రూపకల్పన జరిగిందనీ,అయితే దురదృష్టవశాత్తు అప్పుడు ఆగిపోయినప్పటికీ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1951 లో ప్లానింగ్ కమిషన్ అనుమతించినప్పటికీ మరోసారి ఈ ప్రాజెక్టు రూపకల్పన జరగలేదని ఆయన వివరించారు. రాయలసీమకు రెండు సార్లు దురదృష్టం వెంటాడినప్పటికీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కల్వకుర్తి - నంద్యాల జాతీయ రహదారి రూపంలో రాయలసీమకు మరొకసారి సువర్ణావకాశం లభించిందని ఆయన కలెక్టరుకు తెలిపారు.సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలన్నది రాయలసీమ ప్రజల చిరకాల వాంఛ అనీ, ప్రతిపాదిత అలుగు నిర్మాణ స్థలం దగ్గరే జాతీయ రహదారిలో భాగంగా వంతెన నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని వంతెనతో పాటు అలుగు నిర్మాణం కూడా చేపట్టాలని రాయలసీమ ప్రజలు కోరుతున్నారని దశరథరామిరెడ్డి కలెక్టరు కు వివరించారు. ఇక్కడ అలుగు నిర్మాణం వలన రాయలసీమ ప్రజలకు త్రాగునీరు అందించడమే గాక, హంద్రీనీవా, గాలేరు - నగరి, యస్ ఆర్ బి సీ , తెలుగుగంగ, కె.సి. కెనాల్, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల క్రింద వున్న ఆయకట్టుకు సకాలంలో నీరు అందించవచ్చని, శ్రీశైలం ప్రాజెక్టులోకి పూడికను నివారించడం వలన శ్రీశైలం ప్రాజెక్టు జీవితకాలం పెరుగుతుందని, శ్రీశైలం ప్రాజక్టు కు రక్షణగా ఉంటుందని, ఈ అలుగు నిర్మాణానికి ఎటువంటి భూసేకరణ అవసరం లేకుండా అతి తక్కువ ఖర్చుతో నిర్మాణం చేపట్టవచ్చని ఐదు మందితో కూడిన ఇంజనీర్స్ - ఇన్ -ఛీఫ్స్ కమిటీ 2011 సంవత్సరంలోనే ఫీజుబిలిటి నివేదిక ఇచ్చిందని ఈ సందర్భంగా కలెక్టరు కు ఆయన తెలిపారు.

# అంటే సుందరానికి.. ఓటీటీలో ఇప్పుడే రాదట




నేచురల్ స్టార్ నాని నటించిన ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ మూవీ అంటే సుందరానికి సినిమా ఈ నెల 10వ తేదీన విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై ఓ వర్గం ప్రేక్షకులుల్లో అయితే అంచనాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఎందుకంటే సినిమాకు చిత్ర యూనిట్ సభ్యులు క్రియేట్ చేస్తున్న ఒక పాజిటివ్ వైబ్రేషన్స్ కూడా ఓ వర్గం జనాలను థియేటర్లకు రప్పించేలా చేస్తున్నాయి అని చెప్పవచ్చు.నాని చాలాకాలం తర్వాత చేసిన కామెడీ సినిమా కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ కూడా ఈ సినిమాకు ఎక్కువగా ఎట్రాక్ట్ అయ్యే అవకాశం అయితే ఉంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన ఓటీటీ విడుదల తేదీపై కూడా ఇటీవల కొన్ని కథనాలు వెలువడ్డాయి.ఇంతకు ముందు నాని నటించిన కొన్ని సినిమాలు అయితే డైరెక్ట్ గా ఓటీటీ లో విడుదలైన విషయం తెలిసిందే. అయితే మళ్లీ అదే తరహాలో కొనసాగకూడదు అని అంతేకాకుండా థియేటర్లలో విడుదలైన వెంటనే ఓటీటీ ప్రస్తావన కూడా తీసుకు రాకూడదు అని ఒక బలమైన నిర్ణయానికి వచ్చినట్లు అనిపిస్తోంది.రీసెంట్ గా ఇచ్చిన ఇంటర్వ్యూలో నాని అంటే సుందరానికి సినిమా నాలుగు వారాల తర్వాత విడుదల అవుతుంది అని చాలా రోజులుగా ఒక టాక్ వినిపించింది. అయితే అందులో ఎలాంటి నిజం లేదు అని అసలు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకున్న సంస్థకు కూడా సినిమా ఓటీటీ లో ఎప్పుడు రిలీజ్ అవుతుందనే విషయంలో సరైన క్లారిటీ లేదు అని చెప్పారు.సినిమా ఎక్కువ రోజులు థియేటర్లో ఆడుతుంది అని ఈ సినిమా విజయంపై కూడా తమకు చాలా నమ్మకం ఉంది అని అన్నాడు. ఫుల్ రన్ లో సినిమా హడావిడి ఉన్నంత వరకు కూడా థియేటర్ లోనే ఉంచుతారని ఒక క్లారిటీ అయితే ఇచ్చారు.మరోవైపు మైత్రి మూవీ మేకర్స్ సినిమాలన్నీ కూడా నాలుగు వారాల కంటే ఎక్కువగా థియేటర్లలో సందడి చేసింది లేదు. స్ట్రైట్ గా ఓటీటీ సంస్థలతో డీల్ సెట్ చేసుకునే ఒక మంచి అమౌంట్ ను అందుకుంటున్నారు. ఇక అంటే సుందరానికి విషయంలో అలా జరగకూడదని నాని ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం.

# తందనానంద సాంగ్.. సుందరం హడావుడి మామూలు లేదు

నేచురల్ స్టార్ నాని నటించిన అంటే సుందరానికి సినిమా ఈ వారం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాపై ఓ వర్గం ప్రేక్షకులలో అయితే అంచనాలు గట్టిగానే ఉన్నాయి. ఎందుకంటే నాని నుంచి చాలా రోజుల తర్వాత ఒక ఫుల్ కామెడీ ఎంటర్టైనర్ సినిమా చేయబోతున్నాడు.




బలే బలే మగాడివోయ్ సినిమా తర్వాత మళ్లీ ఆ రేంజ్ లో కామెడీతో మెప్పించలేకపోయాడు.విభిన్నమైన సినిమాలు ట్రై చేస్తున్న నాని ఒక విధంగా సక్సెస్ అందుకున్నప్పటికీ కూడా అతని రెగ్యులర్ ఆడియెన్స్ మాత్రం కామెడీ సినిమా చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక ఈసారి ప్రత్యేకంగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో అంటే సుందరానికి అనే సినిమాతో కామెడీ తో తప్పకుండా సక్సెస్ కావాలని చూస్తున్నాడు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కూడా గట్టిగానే చేస్తున్నారు.రీసెంట్ గా ఈ సినిమాకి సంబంధించిన మరొక పాటను విడుదల చేశారు. తందనానంద ప్రోమో సాంగ్ ను కంపోజ్ చేసిన విధంగా అనే సాంగ్ ను విభిన్నంగా కంపోజ్ చేశారు. ఇక వీడియో సాంగ్ విడుదలైన కొన్ని నిమిషాల్లోనే వైరల్ గా మారిపోయింది. ఈ సినిమాలో నాని ఒక బ్రాహ్మణుడు క్యారెక్టర్ లో కనిపిస్తూ ఉండగా నజరేయా క్రిష్టియన్ అమ్మాయిగా కనిపించబోతున్న విషయం తెలిసిందే.ఇక రెండు మతాల మధ్యలో ఇద్దరు ప్రేమికులు ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నారు అనేది ఈ సినిమాలో కీ పాయింట్ అని తెలుస్తోంది. ఇక అందుకు తగ్గట్టుగానే ఒక ప్రత్యేకమైన పాటను కూడా విడుదల చేశారు. అందులో క్రిష్టియన్ హిందీ పెళ్లి హడావిడిలతో సాంగ్ చాలా అందంగా కనిపిస్తుంది. రెండు మతాలను బ్యాలెన్స్ చేస్తూ ఈ పాటను రచించిన విధానం కూడా ఎంతో అద్భుతంగా ఉంది.వివేక్ సాగర్ ఈ సినిమాకు మ్యూజిక్ అందించగా తందననంద పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు ఇక ప్రముఖ సింగర్ శంకర్ మహదేవన్ అద్భుతమైన గానంతో మరొకసారి క్లాసిక్ మెలోడీని గుర్తు చేశారు. మరియు విభిన్నంగా ప్రేక్షకుల నువ్వు ఎట్రాక్ట్ చేస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# మోక్షజ్ఞ ఎంట్రీపై 'ఎఫ్3' డైరెక్టర్ క్లారిటీ



బ్యాక్ టు బ్యాక్ సక్సెస్ లతో ఇప్పటి వరకు ఫ్లాప్ అంటూ ఎరగని దర్శకుడు అనిల్ రావిపూడి తాజాగా ఎఫ్ 3 సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. బిగ్ బ్లాక్ బస్టర్ కాకున్నా ఎఫ్ 3 మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. డీసెంట్ వసూళ్లను నమోదు చేసింది. అనిల్ రావిపూడి ఎఫ్ 3 హడావిడితోనే బిజీగా ఉన్నాడు. విడుదల తర్వాత కూడా ఏమాత్రం వదలకుండా ప్రమోషన్ చేస్తూ థియేటర్లకు జనాలను రప్పించే ప్రయత్నం చేస్తున్నారు.ఎఫ్ 3 సినిమా ప్రమోషన్ లో భాగంగా ప్రముఖ న్యూస్ ఛానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఆ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను దర్శకుడు అనీల్ రావిపూడి చెప్పుకొచ్చాడు. ఆ ఇంటర్వ్యూలో మోక్షజ్ఞ కు సంబంధించిన సినిమా ను మీరు చేయబోతున్నారట.. మోక్షజ్ఞ ఎంట్రీ మీ దర్శకత్వంలో అనుకుంటున్నారు. అందులో ఎంత వరకు నిజం ఉంది అంటూ అనిల్ రావిపూడిని ప్రశ్నించారు.ఆ ప్రశ్నకు సమాధానంగా మోక్షజ్ఞ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెడితే మంచిదే. అయితే నన్ను ఎవరు ఇప్పటి వరకు మోక్షజ్ఞ సినిమా గురించి స్పందించలేదు. ఇప్పటి వరకు పలు సార్లు బాలయ్య గారిని కలిశాను. ఆయన కూడా ఎప్పుడు మోక్షజ్ఞ గురించిన మాటలు మాట్లాడలేదు. ప్రస్తుతం నా దృష్టి పూర్తిగా బాలకృష్ణ గారితో చేయబోతున్న సినిమా పై ఉందంటూ దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పుకొచ్చాడు.బాలకృష్ణ తో సినిమా చేస్తున్న సమయంలోనే తదుపరి సినిమా యొక్క స్క్రిప్ట్ గురించి ఆలోచిస్తాను. ప్రస్తుతానికి మాత్రం పూర్తిగా నా దృష్టి బాలకృష్ణ సినిమా పైనే అంటూ చెప్పుకొచ్చింది. హీరో బాలయ్య తో సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లుగా చెప్పుకొచ్చాడు. పూర్తి కామెడీ మూవీ కాకుండా పటాస్ వంటి ఎంటర్ టైనర్ కమ్ యాక్షన్ సినిమా గా బాలయ్య సినిమా ఉంటుందని అనిల్ రావిపూడి అన్నాడు.ఇదే సమయంలో ఎఫ్4 సినిమా గురించి కూడా అనిల్ రావిపూడి క్లారిటీ ఇచ్చాడు. తప్పకుండా ఎఫ్ 4 ఉంటుంది. కాని హీరోయిన్స్ వీళ్లే ఉంటారా అనేది చెప్పలేను. అలాగే హీరోలుగా వీళ్లు ఉంటారా లేదంటే అదనంగా యాడ్ అవుతారా అనేది నాకు ఇంకా తెలియదు. కాని ఎఫ 4 చేస్తానంటూ మాత్రం బలంగా హామీ ఇచ్చాడు. ఎఫ్ 4 సినిమా కు ఇంకా చాలా సమయం ఉందని.. బాలయ్య తో సినిమా ఆ తర్వాత మరో సినిమా చేసి ఎఫ్ 4ను షురూ చేస్తానంటూ ప్రకటించాడు.సర్కారు వారి పాట మరియు ఎఫ్ 3 సినిమా లతో అనిల్ రావిపూడి స్టార్ డమ్.. స్థాయి మరింతగా పెరిగింది. దాంతో ఈయనతో సినిమా అంటే పెద్ద హీరోల నుండి చిన్న హీరోల వరకు అంతా కూడా లైన్ లో ఉంటున్నారు. కనుక ఈయన బిజీ బిజీగా ముందు ముందు మరిన్ని సినిమాలు చేస్తే నవ్వుతూ ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తారంటూ కామెంట్స్ వస్తున్నాయి.

# ఫస్ట్‌క్లాస్ క్రికెట్ చరిత్రలో అరుదైన ఫీట్.. బెంగాల్ జట్టు ప్రపంచ రికార్డు

రంజీ క్రికెట్ చరిత్రలో ఒక అరుదైన ఫీట్ చోటుచేసుకుంది. జట్టులో ఉన్న టాప్-9 మంది ఆటగాళ్లు కనీసం హాఫ్ సెంచరీతో మెరిశారు. బెంగాల్, జార్ఖండ్‌ల మధ్య జరుగుతున్న తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బుధవారం ఈ అద్భుతం జరిగింది. ఫస్ట్‌క్లాస్ క్రికెట్ చరిత్రలో టాప్-9 మంది బ్యాటర్స్ ఒకే ఇన్నింగ్స్‌లో కనీసం అర్థసెంచరీ చేయడం ఇదే మొదటిసారి. ఇంతకముందు 1893లో ఆస్ట్రేలియాకు చెందిన 8 మంది బ్యాటర్లు ఆక్స్‌ఫర్డ్ అండ్ కేమ్‌బ్రిడ్జ్ యునివర్సిటీ జట్టుపై అర్థసెంచరీలు సాధించారు. ఈ 8 మంది వరుసగా టాప్-8 బ్యాటర్స్ మాత్రం కాదు. కానీ తాజాగా బెంగాల్ జట్టు మాత్రం ఈ విషయంలో ప్రపంచ రికార్డు నెలకొల్పింది.బెంగాల్ జట్టులో వరుసగా తొమ్మిది మంది బ్యాటర్స్ కనీసం హాఫ్ సెంచరీ మార్క్ సాధించారు. ఈ తొమ్మిది మందిలో సుదీప్ గరామి(380 బంతుల్లో 21 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 186 పరుగులు), అనుస్తుప్ మజుందార్(194 బంతుల్లో 15 ఫోర్ల సాయంతో 117 పరుగులు) సెంచరీలతో మెరవగా.. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ 65, మరో ఓపెనర్ అభిషేక్ రమణ్ మొదట 41 పరుగుల వద్ద రిటైర్డ్‌హర్ట్‌గా వెనుదిరిగాడు. మజుందార్ ఔటైన తర్వాత మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చి 61 పరుగులు చేసి ఔటయ్యాడు.ఇక ఐదో స్థానంలో వచ్చిన ఎంపీ మనోజ్ తివారి 73 పరుగులతో ఆకట్టుకోగా.. వికెట్ కీపర్ అభిషేక్ పోరేల్ 68 పరుగులు చేశాడు. ఇక మ్యాచ్‌లో చివరి వికెట్‌గా వెనుదిరిగిన షాబాజ్ అహ్మద్ 78 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఎనిమిది, తొమ్మిదో స్థానంలో వచ్చిన మోండల్ 53 నాటౌట్, ఆకాశ్‌దీప్( 18 బంతుల్లో 8 సిక్సర్లతో 53 పరుగులు) టి20 తరహాలో అలరించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190